

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV

STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 07 | సంచిక 29 | ఎడిటర్ : బరిగెల శివ | మంగళవారం 30, డిసెంబర్ 2025 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పజాజ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్


# అధికారుల సామర్థ్యాన్ని శాసిస్తున్నారు !







- పైరవీలతో హోరెత్తుతున్న పోస్టింగులు
- ఏ శాఖలో చూసిన ఎస్సీ ఎస్టీ ఐఏఎస్ ఐపీఎస్ అధికారులకు తీవ్ర అన్యాయం జరుగుతుంది
- అధికారుల సామర్థ్యం కన్నా పైరవీలకే పెద్ద ప్రాధాన్యతనిస్తున్నారు
- ఎస్సీ ఎస్టీ ఐఏఎస్ ఐపీఎస్ అధికారులను చిన్నచూపు చూడడం అవమానకరం
- నిజాయితీకి లేని విలువ పైరవీలకు ఉంది
- రాజకీయ అధికారం ముందు ఉన్నతాధికారం పనికి రాకుండా పోతుంది
- ప్రజా సేవలను విస్మరిస్తున్న అధికారులు ముందు వరుసలో ఉంటున్నారు
- ప్రజాసేవకు కట్టుబడుతున్న అధికారులు వెనుకంజలో ఉంటున్నారు
- ఒక్కొక్క అధికారికి రెండేసి మూడేసి పదవులు
- ప్రభుత్వ వ్యవస్థలు బాగుపడేనా ప్రజలకు మేలు జరిగినా
- డాక్టర్ బరిగెల శివ



డాక్టర్ బరిగెల శివ

జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్

హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)

తెలంగాణ రాష్ట్రంలో షెడ్యూల్ కులాలకు చెందిన ఐఏఎస్ ఐపీఎస్ అధికారులకు పోస్టింగ్ల విషయంలో తీవ్ర అన్యాయం జరుగుతుందని డాక్టర్ బరిగెల శివ మండిపడ్డారు. అధికారుల సామర్థ్యాన్ని బట్టి సముచిత స్థానాలుగా దక్కాల్సిన పోస్టింగ్లు పూర్తిగా పైరవీలకు అనుకూలమైపోయినట్లుగా భావిస్తూ ప్రధాన శాఖలన్నీ ప్రభుత్వానికి సంబంధించిన అనుకూలమైన అధికారులకు కేటాయిస్తూ నిజాయితీ, సామర్థ్యం కలిగిన అధికారులను లూప్ లైన్ లలో పోస్టింగ్లు కేటాయించి వాళ్ళ నిజాయితీని వాళ్ళ సామర్థ్యాన్ని శాసిస్తున్నారన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో అదే పరిస్థితి నేడు తెలంగాణ రాష్ట్రం ఏర్పడి సంవత్సరాలు గడుస్తున్న షెడ్యూల్ కులాలకు చెందిన అధికారులకు అదే పరిస్థితి లాగా అధికార పదవుల్లో సముచిత స్థానం దక్కకపోతుండడం బాధాకరమైన విషయం

- మిగతా 2లో..







# తిరుమల చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డి

- స్వాగతం పలికిన టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు
- నేడు వైకుంఠ ఏకాదశి
- తిరుమల విచ్చేసిన తెలంగాణ సీఎంకుటుంబ సమేతంగా వైకుంఠ ద్వార దర్శనం చేసుకోనున్న రేవంత్ రెడ్డి



2

# రూ.32 వేల కోట్ల విలువైన ప్రభుత్వ బాండ్లను వేలం వేయనున్న ఆర్బీఐ

- రూ. 32,000 కోట్ల విలువైన ప్రభుత్వ సెక్యూరిటీల విక్రయానికి ప్రకటన
- జనవరి 2న ఆర్బీఐ ఆధ్వర్యంలో జరగనున్న వేలం
- అవసరమైతే మరో రూ. 2,000 కోట్లు అదనంగా సమీకరించే అవకాశం
- చిన్న ఇన్వెస్టర్ల కోసం 5 శాతం కోటా కేటాయింపు
- ప్రభుత్వ ఖర్చుల కోసం నిధులు సేకరించడమే లక్ష్యం

2






# మహిళ హత్య కేసు.. కూకట్‌పల్లి కోర్టు సంచలన తీర్పు

- 2011లో జరిగిన హత్య కేసులో తీర్పు వెలువరించిన కోర్టు
- నిందితుడు కరణ్ సింగ్‌కు మరణశిక్ష విధించిన కోర్టు
- 14 ఏళ్ల తర్వాత నిందితుడికి శిక్ష ఖరారు

2

# బంగ్లాదేశ్ చొరబాటుదారులు దేశంలో ఎక్కడున్నా పంపించేస్తాం: అమిత్ షా

- అసోంలో నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడిన అమిత్ షా
- బంగ్లాదేశీయులు ఇక్కడి వారిపై బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆగ్రహం
- అలాంటి వారిని కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంకుగా భావిస్తోందని ఆరోపణ

వివరాలు 2లో



# అన్ని ఆలయాల్లో ‘శ్రీవారి సేవకులు’ తరహా విధానం

- సీఎం చంద్రబాబు ఆదేశాలు
- పాలనపై సీఎం చంద్రబాబు సమీక్ష
- వివిధ శాఖలకు కీలక సూచనలు, ఆదేశాలు
- ప్రజలకు రెవెన్యూ సేవలు సులభంగా అందాలి, సర్వేల్లో తప్పులు జరగొద్దని స్పష్టీకరణ
- ధాన్యం కొనుగోళ్లలో ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక
- అగ్నిమాపక శాఖ పనితీరుపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రశంసలు

2

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా సామాన్యుడి ఆయుధంగా
Jai Bheem TV STRUGGLE FOR JUSTICE

# అధికారుల సామర్థ్యాన్ని శాసిస్తున్నారు

మొదటి పేజీ తరువాయి

అన్నారు.నిజాయితీ కలిగిన అధికారులు ప్రభుత్వ నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేయలేక, తిరగలేక పైరవీలు చేసుకోలేక కేవలం వాళ్లకు ఉండబడిన మెరిట్ ర్యాంక్స్ ను ఉద్యోగ ధర్మాన్ని నిజాయితీని వ్యక్తిగత సామర్థ్యాన్ని నమ్ముకొని మాత్రమే ప్రభుత్వం వాళ్ల వాళ్ల సేవలను ఉపయోగించుకుంటుందని క్షేత్రస్థాయిలో ఆశిస్తున్న సందర్భాలు లెక్కలేనన్ని కలవన్నారు.అధికారుల వ్యక్తిగత సామర్థ్యాన్ని ఏమాత్రం పట్టించుకున్నట్టు లేనట్లుగా కేవలం ప్రభుత్వానికి చేదోడువాదోడుగా పనిచేసే అధికారులను మాత్రమే ప్రధాన శాఖలకు కేటాయించుకొని ప్రజాపాలనను కొనసాగిస్తుందన్నారు.ఎస్సీ ఎస్టీ ఐఏఎస్ ఐపీఎస్ అధికారులు వాళ్ళ కుండబడిన రిజర్వేషన్ల హక్కులను కూడా పొందుకోలేకపోతుండడం ఎంతో విచారమన్నారు.పలుకుబడిని పరుపుతిని హోదాలను చూసి పదవులు కేటాయించే పరిస్థితికి ప్రభుత్వం చేరిపోవడం వల్ల నికార్సైన అధికారులు తీవ్ర అన్యాయానికి గురికావాల్సి వస్తుందన్నారు.చాలా సందర్భాల్లో అధికారులు వాళ్ల వాళ్ల సామర్థ్యానికి తగిన న్యాయం జరగటంలేదని లోలోపల ఎంతో మనోవేదన చెందుతూ అధికార ఉద్యోగ ధర్మాన్ని పాటిస్తున్నారని బాధ వ్యక్తం చేశారు.ఏ ప్రభుత్వం ఏర్పడిన ఉన్నత అధికారుల విషయం అనేసరికి ప్రభుత్వానికి అనుకూలంగా ఉంటే ఒకరకంగా అనుకూలంగా లేకపోతే మరో రకంగా న్యాయం జరిగించబడే ఆస్కారం కలదని చాలా స్పష్టంగా వెల్లడవుతుందన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోనికి వచ్చి రెండు సంవత్సరాలు గడుస్తుండగా ప్రభుత్వానికి అనుకూలమైన అధికారులు రెండేసి మూడేసి పదవులలో ఒకే అధికారిని ఇన్చార్జిలుగా కేటాయిస్తూ కొనసాగించడం అధికార ధర్మానికి అధికార నియమాలకు పూర్తి విరుద్ధమని ప్రభుత్వానికి తెలిసినప్పటికిని వాళ్లతోనే ప్రభుత్వ పాలన కాలం గడపడం విడ్డూరంగా ఉందన్నారు.సామర్థ్యం ఉన్న అధికారులను పక్కన పెడుతున్నట్టుగా ప్రభుత్వం కేటాయిస్తున్న పోస్టింగ్ల ఉత్తర్వులు స్పష్టం చేస్తున్నాయన్నారు.మంత్రుల కనుసందల్లో పనిచేస్తున్న ఐఏఎస్ ఐపీఎస్ అధికారులకు బోనస్ పదవులు దక్కుతున్నాయని గుర్తు చేశారు.ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డి దగ్గర మూడు పదవులు ఏ విధంగా నైతే ఉన్నాయో అదేవిధంగా ఉన్నతాధికారులకు పోస్టింగ్ లతోపాటు ఇన్చార్జి పోస్టింగులు బోనస్ గా కల్పిస్తుండడం ఒకే అధికారి వివిధ శాఖలలో పని చేస్తూ ఏ శాఖకు సరైన న్యాయం చేయలేకపోతున్నారని విశ్లేషించారు.ఏ అధికారికైనా ఒకే పదవిని కేటాయించడం వల్ల ఆ శాఖకు పూర్తి బాధ్యత వహిస్తూ సరియైన సమయాన్ని కేటాయించి శాఖ పరమైన విధులకు సరైన న్యాయం చేయగలరని అలా కాకుండా ఒక్కొక్క ఉన్నతాధికారులను మార్చి మార్చి పోస్టింగ్లలో కొనసాగించడం ప్రభుత్వ శాఖల పనితనాన్ని నీరుగారుస్తున్నట్లుగా కనిపిస్తుందన్నారు.ఒకవైపు రాష్ట్రంలో ప్రభుత్వ కార్యాలయాలలో విపరీతంగా అవినీతి పెరిగిపోతుందని రాష్ట్ర ప్రజలు భావిస్తున్న తరుణంలో మరోవైపు ప్రభుత్వానికి అనుకూలమైన అధికారులే ప్రధాన శాఖలలో కొనసాగుతున్నప్పుడు రాష్ట్రంలో జరుగుతున్న అవినీతిమయమంతా ఎవరు పెంచి పోషిస్తున్నారు ఎటు తోచడం లేదన్నారు. ముఖ్యంగా రెవెన్యూ మున్సిపల్ పోలీస్ విద్యా శాఖలలో ఎక్కువ అవినీతి అక్రమాలు జరుగుతున్నాయని వాటిని ప్రభుత్వం తెలిసి కూడా పట్టింపు లేనట్టుగా ఉంటుండడం గమనిస్తుంటే నాయకులు అధికారులు అంతా కావాలని చేస్తున్నట్లుగా ఉందన్నారు.ప్రధాన శాఖలలో ఎస్సీ ఎస్టీ ఐఏఎస్ ఐపీఎస్ అధికారులు పనికిరారా అంటూ ప్రభుత్వాన్ని నిలదీశారు.ప్రజాస్వామ్య ప్రభుత్వం ప్రజా పాలన ప్రభుత్వం ప్రజల కొరకు ఏర్పాటు చేయబడిన ప్రభుత్వమని నాయకులు ప్రతి సభలలో గొప్పలు చెప్పుకోవడం మినహాయిస్తే ఎస్సీ ఎస్టీ ఉన్నతాధికారులకు ఎక్కడ న్యాయం చేస్తున్నారో చెప్పాలన్నారు.పనితనాన్ని బట్టి సమచిత గౌరవాన్ని ఇవ్వలేనప్పుడు అధికారుల మనస్తత్వం ఎంతగా మనోవేదన చెందుతుందో ప్రభుత్వం గుర్తించలేకపోతుందన్నారు.కొంతమంది ఎస్సీ ఎస్టీ ఐఏఎస్ ఐపీఎస్ అధికారులను గత ప్రభుత్వ పాలకులకు చెందిన సన్నిహితులుగా పరిగణిస్తూ వాళ్లకు పోస్టింగులను కేటాయించడంలో పూర్తిగా అన్యాయం చేస్తుందని గుర్తు చేశారు.సీనియారిటీని బట్టి సిన్సియారిటీని బట్టి పోస్టింగులు కేటాయించబడాలి గాని రాజకీయపైరవీలను అధికార పైరవీలను కొనసాగించుకొని పోస్టింగులు పొందుకోవడం ప్రజా పాలన ప్రభుత్వమని చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వానికే వదిలేయాలన్నారు.చాలా కార్యాలయాలలో ప్రజా సమస్యలను పట్టింపు లేకుండా వ్యవహరిస్తున్న అధికారులే ప్రధాన శాఖలలో కొనసాగుతున్నట్లుగా తెలంగాణ రాష్ట్ర ప్రజలు విమర్శిస్తున్నారన్నారు. ఇకనైనా ప్రజాపాలన ప్రభుత్వమని చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజల విశ్వాసాన్ని కాపాడుకోవడం కోసం ఉన్నతాధికార పదవులలో సామర్థ్యం కలిగిన నిజాయితీ కలిగిన ఎస్సీ ఎస్టీ ఐఏఎస్ ఐపీఎస్ అధికారులను ప్రధాన శాఖలో కొనసాగిస్తూ వాళ్ళను గౌరవించాలని తెలిపారు.చివరగా భావిస్తున్నట్లయితే తెలంగాణ రాష్ట్రంలో రాజకీయ పార్టీల మధ్య కొనసాగుతున్న కక్ష సాధింపులు ఐఏఎస్ ఐపీఎస్ అధికారులకు రుద్దుతుండడం విచారకరంగా ఉందన్నారు.అందులో ప్రధానంగా ఎస్సీ ఎస్టీ ఐఏఎస్ ఐపీఎస్ అధికారులపై ఇంకాస్త ఎక్కువగా కొనసాగించబడుతుందన్నారు. లూప్ లైన్లో పోస్టింగులు కేటాయించబడిన ఎస్సీ ఎస్టీ ఐఏఎస్ ఐపీఎస్ అధికారులు తీవ్ర మనోవేదన చెందుతూ వాళ్లకు జరుగుతున్న అన్యాయాన్ని ఎవరికి చెప్పుకోవాలో తెలియక అన్నిటికీ తగ్గించుకొని ఉద్యోగ ధర్మాన్ని బాధ్యతగా నెరవేరుస్తున్నారు.ప్రజలకు సేవ చేయాలి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి అనుకునే ఉన్నతాధికారులు నిజాయితీని పాటిస్తూ లూప్లైన్లకు పరిమితమైపోతుండగా, ప్రజాసేవను అనామాకంగా తీసుకుంటూ పైరవీలతో పోస్టింగులు పొందుకున్న ఉన్న అధికారులు మాత్రం యదేచ్ఛగా ఆస్తులు సంపాదించుకుంటున్నారన్నారు

## తిరుమల చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డి

**స్వాగతం పలికిన టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు**
**నేడు వైకుంఠ ఏకాదశి**
**తిరుమల విచ్చేసిన తెలంగాణ సీఎంకుటుంబ సమేతంగా వైకుంఠ ద్వార దర్శనం చేసుకోనున్న రేవంత్ రెడ్డి**



**తిరుమల, జై భీమ్ న్యూస్**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం సాయంత్రం తిరుమల క్షేత్రానికి చేరుకున్నారు. ఆయనకు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, టీటీడీ అధికారులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌ను చైర్మన్ శాలువాతో సత్కరించి, శ్రీవారి చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యురాలు పనబాక లక్ష్మి, ఏపీ మంత్రులు అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్ కూడా పాల్గొన్నారు. నేడు (మంగళవారం) ఉదయం తన కుటుంబ సభ్యులతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి శ్రీవారిని దర్శించుకోనున్నారు. వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆయన వైకుంఠ ద్వార దర్శనం చేసుకోనున్నారని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. కాగా, సీఎం రేవంత్ రెడ్డి నేటి సాయంత్రం హైదరాబాద్ తిరిగి వస్తారు. రేపటి నుంచి అసెంబ్లీ సమావేశాలకు హాజరవుతారు.

## అన్ని ఆలయాల్లో 'శ్రీవారి సేవకులు' తరహా విధానం

**సీఎం చంద్రబాబు ఆదేశాలు.. పాలనపై సీఎం చంద్రబాబు సమీక్ష**
**వివిధ శాఖలకు కీలక సూచనలు, ఆదేశాలు**
**ప్రజలకు రెవెన్యూ సేవలు సులభంగా అందాలి,**
**సర్వేల్లో తప్పులు జరగొద్దని స్పష్టీకరణ**
**ధాన్యం కొనుగోళ్లలో ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక**
**అగ్నిమాపక శాఖ పనితీరుపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రశంసలు**

**అమరావతి, జై భీమ్ న్యూస్**

రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లో తిరుమల శ్రీవారి సేవకుల తరహాలో స్వచ్ఛంద సేవలను ప్రవేశపెట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. రెవెన్యూ సేవలను ప్రజలకు మరింత సులభంగా అందించాలని, భూ సర్వేల్లో ఎలాంటి తప్పిదాలకు ఆస్కారం ఇవ్వరాదని స్పష్టం చేశారు. సోమవారం నాడు అమరావతిలోని ఆర్టీజీఎస్ నుంచి రెవెన్యూ, వ్యవసాయం, వైద్యారోగ్యం, దేవదాయ సహా పలు కీలక శాఖల పనితీరుపై ఆయన సమీక్ష నిర్వహించారు. క్షేత్రస్థాయిలో ప్రభుత్వ సేవలు ప్రజలకు ఎలా అందుతున్నాయనే దానిపై అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లో స్థానిక భక్తులతో వాలంటీర్లను నియమించుకోవాలి. భగవంతుడి సేవ చేసేందుకు చాలామంది ముందుకొస్తారు. అలాంటి వారిని ప్రోత్సహించి, వారి సేవలను వినియోగించుకోవాలి. ఇప్పటికే శ్రీశైలంలో ఈ విధానం కొనసాగుతోంది. ఇదే స్ఫూర్తితో అన్ని ఆలయాల్లో అమలు చేయాలి" అని దేవదాయ శాఖ అధికారులకు సూచించారు. ప్రజలకు నిత్యం అవసరమయ్యే రెవెన్యూ, వైద్యారోగ్య శాఖల పనితీరుపై సీఎం ప్రత్యేకంగా దృష్టి సారించారు. "ప్రజలకు రెవెన్యూ సేవలు సులభంగా, వేగంగా అందాలి. భూ సర్వేలు చేపట్టేటప్పుడు ప్రజలు ఇబ్బందులు పడకూడదు. ఈ విషయంలో రెవెన్యూ యంత్రాంగంపై ఉన్న చెడ్డపేరును తొలగించుకునేలా పనిచేయాలి" అని ఆయన దిశానిర్దేశం చేశారు. అదేవిధంగా పీహెచ్‌సీల నుంచి జిల్లా ఆసుపత్రుల వరకు అన్నిచోట్లా పరిశుభ్రత పాటిస్తూ, మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. వైద్యులందరూ ప్రజలకు అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. మెరుగైన ప్రజారోగ్యం కోసం వ్యవసాయ, వైద్యారోగ్య శాఖలు సమన్వయంతో పనిచేయాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. "భూసార పరీక్షలు నిర్వహించి, ఎరువుల వాడకాన్ని తగ్గించేలా రైతులకు అవగాహన కల్పించాలి. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఏ పంటలు పండించాలో తెలియజేయాలి. దీనికోసం క్షేత్రస్థాయిలో రైతు సేవా కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు కలిసి పనిచేయాలి" అని సూచించారు. ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకూడదని, మిల్లర్లు ప్రభుత్వానికి చెడ్డపేరు తేవాలని చూస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్టింగ్ సెంటర్లను ఏర్పాటు చేయాలని రవాణా శాఖను ఆదేశించారు. అగ్నిమాపక శాఖ పనితీరు బాగుందని అభినందించారు. ఈ సమీక్షలో వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ సహా పలు నగరాల్లో... నేడు 118 ఇండిగో విమానాలు రద్దు

**విమానాల రద్దు అంశాన్ని వెబ్‌సైట్ ద్వారా తెలిపిన ఇండిగో**
**ఆపరేషనల్ కారణాలు, వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో విమానాలు రద్దు**
**హైదరాబాద్‌తో పాటు ఢిల్లీ, ముంబై, బెంగళూరు నగరాల్లో విమానాలు రద్దు**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

ప్రతికూల వాతావరణ పరిస్థితులు మరియు ఇతర సమస్యల కారణంగా ఈ రోజు 118 విమానాలను రద్దు చేసినట్లు దేశీయ విమానయాన సంస్థ ఇండిగో ప్రకటించింది. ఈ మేరకు ఆ సంస్థ తన వెబ్‌సైట్‌లో పొందుపరిచింది. వీటిలో ఆరు విమాన సర్వీసులు నిర్వహణ కారణాలతో నిలిచిపోగా, మిగిలినవి వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో రద్దు చేసినట్లు పేర్కొంది. హైదరాబాద్‌తో పాటు ఢిల్లీ, ముంబై, బెంగళూరు, కొచ్చిన్, కోల్‌కతా, అమృత్‌సర్, చండీగఢ్, జైపూర్, డెహ్రాడూన్, ఇండోర్, పాట్నా, భోపాల్ నగరాల్లో విమాన సర్వీసులు రద్దు చేయబడినట్లు ఇండిగో వెబ్‌సైట్ ద్వారా తెలిపింది. ఢిల్లీ, ఉత్తర భారతదేశంలోని అనేక విమానాశ్రయాలలో పొగమంచు వాతావరణ పరిస్థితులు కొనసాగుతున్నాయని ఆ సంస్థ పేర్కొంది.

## బంగ్లాదేశ్ చొరబాటుదారులు దేశంలో ఎక్కడున్నా పంపించేస్తాం: అమిత్ షా

**అసోంలో నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడిన అమిత్ షా**
**బంగ్లాదేశీయులు ఇక్కడి వారిపై బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆగ్రహం**
**అలాంటి వారిని కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంకుగా భావిస్తోందని ఆరోపణ**

**అస్సోం, జై భీమ్ న్యూస్**



భారతదేశంలో ఎక్కడ ఉన్నా బంగ్లాదేశ్ చొరబాటుదారులను వెనక్కి పంపిస్తామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. అసోంలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, సరిహద్దులు దాటి రాష్ట్రంలోకి చొరబడిన బంగ్లాదేశీయులు ఇక్కడి ప్రజల సంస్కృతి, గుర్తింపులకు ముప్పుగా పరిణమిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ వారిని ఓటు బ్యాంకుగా చూస్తోందని ఆయన ఆరోపించారు. ఆ ఓటు బ్యాంకును కాపాడుకునేందుకు ప్రతిపక్ష కూటమి ఓటరు జాబితా ఎస్ఐఆర్‌ను వ్యతిరేకిస్తోందని విమర్శించారు. అసోంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నో ఏళ్లు అధికారంలో ఉన్నప్పటికీ రాష్ట్రంలో ఎలాంటి అభివృద్ధి చేయలేదని దుయ్యబట్టారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రజల సాంస్కృతిక గుర్తింపును కాపాడటంతో పాటు రాష్ట్ర సమగ్ర అభివృద్ధిపై దృష్టి సారించిందని తెలిపారు. బంగ్లాదేశ్ చొరబాటుదారులు ఆక్రమించుకున్న లక్షకు పైగా బిఘాల భూమిని ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం విడిపించిందని కొనియాడారు. రాష్ట్రంలో పాతుకుపోయిన చొరబాటుదారులను పూర్తిగా నిర్మూలించడానికి బీజేపీకి మరో అవకాశం ఇవ్వాలని కోరారు. గత 11 ఏళ్లలో బీజేపీ ప్రభుత్వం రాష్ట్రంలోని పలు మిలిటెంట్ సంస్థలతో శాంతి ఒప్పందం చేసుకుందని గుర్తు చేశారు.

## 'పాత బాస్' కోసమే రేవంత్ రెడ్డి ఆ ప్రాజెక్టును నిలిపివేశారు: కేటీఆర్

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన 'పాత బాస్', ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబును ప్రసన్నం చేసుకునేందుకే పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని నిలిపివేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే మాజీ సీఎం కేసీఆర్‌కు మంచి పేరు వస్తుందనే భయంతో పాటు, చంద్రబాబుకు ఆగ్రహం కలుగుతుందనే ఉద్దేశంతోనే రేవంత్ రెడ్డి పనులను ముందుకు సాగనీయడం లేదని ఆయన విమర్శించారు. సోమవారం అసెంబ్లీ ప్రాంగణంలో మీడియాతో మాట్లాడిన కేటీఆర్, పాలమూరు ప్రాజెక్టుకు కేవలం 45 టీఎంసీల కేటాయింపులను అంగీకరించడం రాష్ట్రానికి నష్టదాయకమని అన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వమే కృష్ణా జలాల్లో 299 టీఎంసీలకు అంగీకరించిందని, దాని ఆధారంగానే బీఆర్ఎస్ ప్రభుత్వం కేటాయింపులు పెంచాలని కేంద్రాన్ని కోరిందని గుర్తుచేశారు. కేసీఆర్ చిత్తశుద్ధి వల్లే కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తయిందని, దానిపై ఎన్ని విచారణలు జరిపినా రాజకీయంగా తమకు నష్టం లేదని, నీళ్లు ఇచ్చిందెవరో ప్రజలకు తెలుసని అన్నారు. ఆర్థిక ప్రయోజనాల కోసమే, మర్చంట్ బ్యాంకర్లు, బ్రోకర్ల సలహాతో జీహెచ్ఎంసీని మూడు భాగాలుగా విభజించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని కేటీఆర్ ఆరోపించారు. ఈ చర్యలను తీవ్రంగా వ్యతిరేకిస్తామని, అసెంబ్లీలో చర్చిస్తామని హెచ్చరించారు. ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలపై స్పందిస్తూ, నిఘా వ్యవస్థలు నెహ్రూ కాలం నుంచి ఉన్నాయని, ప్రస్తుతం ప్రతిపక్ష నేతల ఫోన్లు ట్యాప్ కావడం లేదని సీఎం కచ్చితంగా చెప్పగలరా అని ప్రశ్నించారు. సిట్‌లు, విచారణల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల దృష్టిని మళ్లిస్తోందని కేటీఆర్ విమర్శించారు. ఇటీవలి సర్పంచ్ ఎన్నికల ఫలితాలే కాంగ్రెస్ పాలనపై ప్రజా తీర్పు అని, రెండేళ్లలోనే ప్రజలు ఆ ప్రభుత్వాన్ని తిరస్కరించారని ఆయన వ్యాఖ్యానించారు.

## రూ.32 వేల కోట్ల విలువైన ప్రభుత్వ బాండ్లను వేలం వేయనున్న ఆర్బీఐ

**రూ. 32,000 కోట్ల విలువైన ప్రభుత్వ సెక్యూరిటీల విక్రయానికి ప్రకటన**
**జనవరి 2న ఆర్బీఐ ఆధ్వర్యంలో జరగనున్న వేలం**
**అవసరమైతే మరో రూ. 2,000 కోట్లు అదనంగా సమీకరించే అవకాశం**
**చిన్న ఇన్వెస్టర్ల కోసం 5 శాతం కోటా కేటాయింపు**
**ప్రభుత్వ ఖర్చుల కోసం నిధులు సేకరించడమే లక్ష్యం**

**ఢిల్లీ, జై భీమ్ న్యూస్**



దేశీయ మార్కెట్ నుంచి నిధులు సమీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఇందులో భాగంగా రూ. 32,000 కోట్ల విలువైన ప్రభుత్వ సెక్యూరిటీలను విక్రయించనున్నట్లు సోమవారం ప్రకటించింది. 6.48 శాతం ప్రభుత్వ సెక్యూరిటీ 2035 రీ-ఇష్యూ కింద ఈ అమ్మకాలు జరపనున్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ముంబై కార్యాలయం ఆధ్వర్యంలో జనవరి 2న ఈ వేలం జరగనుంది. మల్టిపుల్ ప్రైస్ విధానంలో ఈ వేలాన్ని నిర్వహిస్తారు. ఈ సెక్యూరిటీపై మరో రూ. 2,000 కోట్ల వరకు అదనపు సబ్‌స్క్రిప్షన్‌ను నిలుపుకునే వెసులుబాటు ప్రభుత్వానికి ఉంటుందని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. ఈ వేలంలో పాల్గొనేవారు ఆర్బీఐ కోర్ బ్యాంకింగ్ సొల్యూషన్ (ఈ-కుబేర్) ప్లాట్‌ఫామ్ ద్వారా ఎలక్ట్రానిక్ రూపంలో బిడ్లను దాఖలు చేయాలి. నాన్-కాంపిటీటివ్ బిడ్లను ఉదయం 10:30 నుంచి 11:00 గంటల మధ్య, కాంపిటీటివ్ బిడ్లను ఉదయం 10:30 నుంచి 11:30 గంటల మధ్య సమర్పించాల్సి ఉంటుంది. అర్హులైన వ్యక్తులు, సంస్థల కోసం మొత్తం నోటిఫైడ్ మొత్తంలో 5 శాతం నాన్-కాంపిటీటివ్ బిడ్డింగ్ కింద కేటాయించారు. సాధారణంగా ప్రభుత్వాలు తమ బడ్జెట్ లోటును భర్తీ చేసుకోవడానికి, మౌలిక సదుపాయాలు, సంక్షేమ పథకాల వంటి ప్రజా ఖర్చులకు నిధులు సమీకరించడానికే ఇలా బాండ్లను విక్రయిస్తాయి. వేలం ఫలితాలను జనవరి 2న ప్రకటిస్తారు. విజయవంతమైన బిడ్డర్లు జనవరి 5న చెల్లింపులు చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వ హామీ ఉండటంతో ఈ బాండ్లను సురక్షితమైన, తక్కువ రిస్క్ ఉన్న పెట్టుబడులుగా పరిగణిస్తారు.

## మహిళ హత్య కేసు.. కూకట్‌పల్లి కోర్టు సంచలన తీర్పు

**2011లో జరిగిన హత్య కేసులో తీర్పు వెలువరించిన కోర్టు**
**నిందితుడు కరణ్ సింగ్‌కు మరణశిక్ష విధించిన కోర్టు**
**14 ఏళ్ల తర్వాత నిందితుడికి శిక్ష ఖరారు**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

హైదరాబాద్‌లో జరిగిన ఒక హత్య కేసులో కూకట్‌పల్లి కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ఈ కేసులోని నిందితుడికి మరణశిక్ష విధిస్తూ తీర్పు చెప్పింది. సనత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని భరత్ నగర్‌లో 2011లో జరిగిన హత్య కేసులో కోర్టు ఈ తీర్పును వెలువరించింది. ఈ కేసులో నిందితుడు కరణ్ సింగ్‌కు మూడవ అదనపు డిస్ట్రిక్ట్ జడ్జి వెంకటేశ్వర రావు మరణశిక్ష విధిస్తూ తీర్పును వెలువరించారు. నిందితుడికి 14 సంవత్సరాల తర్వాత శిక్ష పడింది. కరణ్ సింగ్ 2011లో ఒక మహిళను హత్య చేశాడు. వివాహేతర సంబంధం నేపథ్యంలో ఈ హత్య జరిగిందని పోలీసుల విచారణలో తేలింది. అప్పటి సనత్ నగర్ పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ రాము ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అనంతరం ఛార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసు దర్యాప్తులో పాల్గొన్న పోలీసులకు, అధికారులకు సీపీ అవినాశ్ మహంతి అభినందనలు తెలిపారు.

# ఆస్పత్రుల యాజమాన్యాలు పారదర్శకంగా వ్యవహరించాలి





**రోగులకు ఖర్చుల వివరాలు, ఆరోగ్య స్థితి ఎప్పటికప్పుడు తెలియజేయాలి**
**జిల్లా డీఎంహెచ్ఓ డాక్టర్ ఏ. అప్పయ్య**

**హన్మకొండ, 29 డిసెంబర్ 2025 (జై భీమ్ న్యూస్)**

ఆస్పత్రుల యాజమాన్యాలు రోగులకు, వారి బంధువులకు చికిత్స నిమిత్తం దాదాపుగా అయ్యే ఖర్చును ముందుగానే స్పష్టంగా తెలియజేయడమే కాకుండా, రోగి ఆరోగ్య స్థితిని ఎప్పటికప్పుడు వివరించాల్సిన బాధ్యత ఉందని హనుమకొండ జిల్లా డీఎంహెచ్ఓ డాక్టర్ ఏ. అప్పయ్య స్పష్టం చేశారు. రోగులకు అవసరమైన కౌన్సిలింగ్ నిర్వహించడంతో పాటు, అన్ని రికార్డులను నిబంధనల ప్రకారం సక్రమంగా నిర్వహించాలని ఆయన ఆదేశించారు. వివిధ సామాజిక మాధ్యమాల్లో వచ్చిన వార్తలకు స్పందించిన డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య బృందంతో కలిసి సోమవారం రోజున చక్రవర్తి హాస్పిటల్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రికి సంబంధించిన డీఎంహెచ్ఓ జారీ చేసిన అనుమతి పత్రాలు, ఇతర సంబంధిత అనుమతులు, టారిఫ్ లిస్ట్, ఆస్పత్రిలో సేవలందిస్తున్న డాక్టర్ల వివరాలు, ల్యాబ్ విభాగాలను సమగ్రంగా పరిశీలించారు. అన్ని అనుమతి పత్రాలు రిసెప్షన్ వద్ద లేదా ప్రజలకు స్పష్టంగా కనిపించే విధంగా ప్రదర్శించాలని సూచించారు. తనిఖీ సమయంలో అక్కడ చికిత్స పొందుతున్న పేషెంట్లతో, వారి బంధువులతో నేరుగా మాట్లాడి ఇప్పటివరకు ఎంత మొత్తం చెల్లించారో, రోగి ఆరోగ్య పరిస్థితిని ఆస్పత్రి సిబ్బంది ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నారా లేదా అనే అంశాలను అడిగి తెలుసుకున్నారు. డాక్టర్ల ఫీజులు, ల్యాబ్ పరీక్షలు, ఇతర వైద్య సేవలకు ఎంత వసూలు చేస్తున్నారో, వాటికి సంబంధించిన ధరల పట్టికలను చూపిస్తున్నారా అనే విషయాలపై కూడా ఆరా తీశారు. రోగులకు మానవీయ కోణంలో, బాధ్యతాయుతంగా చికిత్స అందించాలని ఆస్పత్రి యాజమాన్యాన్ని హెచ్చరించారు. అనంతరం డీఎంహెచ్ఓ బృందం మహి హాస్పిటల్ ను సందర్శించి అక్కడ కూడా అనుమతి పత్రాలు, వివిధ విభాగాలను తనిఖీ చేశారు. అలాగే ప్రోగ్రాం అధికారి (మాతా%-%శిశు సంక్షేమం) డాక్టర్ రుబీనా ఆధ్వర్యంలో గ్రావిడ్ హెూమ్, విజయ డయాగ్నొస్టిక్స్, కళ్యాణి హాస్పిటల్, లుమినిస్ హాస్పిటల్లను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో సిజేరియన్ సెక్షన్లు, సాధారణ ప్రసవాలు, ఎంటీపి, ఫామ్%-%ఎఫ్ రికార్డులను సవివరంగా పరిశీలించి, ఎలాంటి లోపాలు లేకుండా చట్ట నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్టాటిస్టికల్ అధికారి జి. ప్రసన్నకుమార్, హెచ్ఈఓ రాజేశ్వర్ రెడ్డి, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా భవిత సెంటర్‌లో బహుమతి ప్రధానోత్సవం



**వరంగల్, 29 డిసెంబర్ 2025 (జై భీమ్ న్యూస్)**

అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం (డిసెంబర్ 3)ను పురస్కరించుకొని వరంగల్ మండలం ఎల్.బి.నగర్‌లోని భవిత సెంటర్లో దివ్యాంగ విద్యార్థినీ%-%విద్యార్థుల కోసం నిర్వహించిన వివిధ పోటీల విజేతలకు బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సమ్మిళిత విద్యా జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ కట్ల శ్రీనివాస్ విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రత్యేక అవసరాల విద్యార్థులకు నాణ్యమైన బోధన అందిస్తున్న భవిత సెంటర్ ఉపాధ్యాయులు స్వాతి, సువర్ణ, నవ్య, సంతోష్ల సేవలను ప్రశంసించారు. ప్రభుత్వం ప్రత్యేక అవసరాల పిల్లలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో భవిత సెంటర్‌ను పునర్నిర్మాణం (రెనోవేషన్) చేసి ఆధునిక సదుపాయాలతో అందుబాటులోకి తీసుకువచ్చిందని ఆయన తెలిపారు. ప్రత్యేక అవసరాల పిల్లల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు, వారి ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు ఇలాంటి పోటీలు ఎంతో ఉపకరిస్తాయని పేర్కొంటూ, పోటీలను విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ మండల విద్యాశాఖాధికారి వెంకటేశ్వర రావు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు డా. బి.వి.ఎన్. స్వామి, ప్రాథమిక పాఠశాల (మౌలాలి) ప్రధానోపాధ్యాయులు జోసెఫ్, భవిత సెంటర్ ఉపాధ్యాయినీలు సువర్ణ, స్వాతి, నవ్య, కొత్తపేట స్పెషల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులు సంతోష్, ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఎపిలో తగ్గిన క్రైమ్ రేటు

**అమరావతి,డిసెంబర్29(జై భీమ్ న్యూస్):**

గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ఏపీలో క్రైం రేటు బాగా తగ్గిందని డీజీపీ హరీష్ కుమార్ గుప్తా తెలిపారు. పోలీస్ శాఖ తీసుకున్న నిర్ణయాల వల్ల నేరాల సంఖ్య గణనీయంగా తగ్గిందన్నారు. 2025 సంవత్సరానికి గాను వార్షిక నేర నివేదికను సోమవారం ఏపీ డీజీపీ విడుదల చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. మహిళలకు రక్షణ, మత్తు పదార్థాల రవాణా, సెల్‌ఫోన్లు రికవరీ వంటి అనేక వాటిలో మంచి పురోగతి సాధించామని చెప్పుకొచ్చారు. నిరంతరం సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ఈ నేరాలను మరింత తగ్గించేలా నూతన ఏడాదిలో పోలీసులు పని చేస్తారన్నారు. వచ్చే పదేళ్లల్లో పోలీసింగ్ ఎలా ఉంటుందనే దానిపై వర్క్‌షాపు నిర్వహిస్తున్నామని అన్నారు. పోలీసు విధుల్లో వచ్చిన మార్పులు, సాంకేతిక పరిజ్ఞానం, ఎలా అందిపుచ్చుకోవాలో వివరిస్తామని తెలిపారు. సంక్రాంతి పండుగ తర్వాత ఈ వర్క్‌షాపు ఉంటుందని వెల్లడించారు. అలాగే ఇటీవల కీలక కేసులను కూడా ప్రస్తావిస్తూ.. ఎలా ఛేధించారో వివరిస్తామని తెలిపారు. సరికొత్త పోలీసింగ్ కనిపించేలా ఈ వర్క్‌షాపు ద్వారా అందరికీ తెలియచేస్తామన్నారు. అప్పా ఒక్కటే మనకు పెండింగ్‌లో ఉందని.. దానిపై త్వరలోనే ప్రకటన వస్తుందని తెలిపారు. చట్టానికి అందరూ సమానమే అని.. వ్యతిరేకంగా వెళ్లేవారిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఇందులో విజయం, అపజయం ఉండదని.. చట్టాన్ని చేతుల్లోకి తీసుకున్న వారిపై చర్యలు తీసుకోవమే తమ విధి అని స్పష్టం చేశారు. సేఫ్ ఏరియా అనుకుని కొంతమంది నక్సలైట్లు ఏపీలోకి వచ్చారని.. కానీ ఎప్పటికప్పుడు తాము నిఘా ఉంచి వారందరినీ పట్టుకున్నామన్నారు. సైబర్ నేరాలకు సంబంధించి చైనాలో పెద్ద గ్యాంగ్స్ ఉన్నాయని తెలిపారు. మోసం జరిగిన వెంటనే ఆ దేశానికి నగదు వెళ్లిపోతుందని చెప్పారు.

## కేర్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో జాతీయ సదస్సు

**డ్రగ్ డెవలప్‌మెంట్‌పై అమెరికా నిపుణుల ప్రసంగాలు**





**హన్మకొండ, ఒగ్లాపూర్ 29 డిసెంబర్ 2025 (జై భీమ్ న్యూస్)**

ఒగ్లాపూర్, హనుమకొండలోని కేర్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో జాతీయ స్థాయి సెమినార్‌ను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సెమినార్‌కు అమెరికా దేశానికి చెందిన ప్రముఖ ఫార్మసీ నిపుణులు ముఖ్య వక్తలుగా పాల్గొని, డ్రగ్ డెవలప్‌మెంట్ రంగంలోని తాజా అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య వక్తలుగా డాక్టర్ రమణకుమారి (ఎం.ఫామ్, పీహెచ్‌డీ, యూఎస్ ఎఫ్‌డిఏ డిప్యూటీ డివిజన్ డైరెక్టర్), డాక్టర్ రాజేంద్ర (ఎం.ఫామ్, పీహెచ్‌డీ, రిటైర్డ్ సీనియర్ రివ్యూ ఫార్మసిస్ట్ %-% యూఎస్ ఎఫ్‌డిఏ) పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా ఆచార్య గాదే సమ్మయ్య (డీన్, ఫ్యాకల్టీ ఆఫ్ ఫార్మసీ) మరియు ఆచార్య జానప రెడ్డి కృష్ణవేణి (ప్రిన్సిపాల్ %ఆ% హెడ్, ఫార్మసీ విభాగం, కాకతీయ యూనివర్సిటీ) హాజరయ్యారు. ఈ సందర్భంగా "డ్రగ్ డెవలప్‌మెంట్ %-% ఫ్రమ్ ఎ ప్రొడక్ట్ క్వాలిటీ అండ్ క్లినికల్ ఫార్మకాలజీ పర్స్పెక్టివ్" అనే అంశంపై డాక్టర్ రమణకుమారి ప్రసంగించారు. డ్రగ్ రీసెర్చ్‌లో క్లినికల్ ఫార్మకాలజీ, ఫార్మకోకైనెటిక్స్, ఫార్మకోడైనమిక్స్ పాత్ర ఎంతో కీలకమని వివరించారు. సరైన ఔషధాన్ని, సరైన మోతాదులో, సరైన సమయంలో, సరైన వ్యక్తికి అందించినప్పుడు మెరుగైన చికిత్స ఫలితాలు లభిస్తాయని తెలిపారు. అలాగే ఏఐ, ఎంఎల్ టెక్నాలజీల ద్వారా డ్రగ్ రీసెర్చ్‌ను మరింత వేగవంతం చేయవచ్చని పేర్కొన్నారు. రెండవ ముఖ్య వక్త డాక్టర్ రాజేంద్ర మాట్లాడుతూ, క్వాలిటీ కంట్రోల్‌లో పాటించాల్సిన రెగ్యులేటరీ నిబంధనలు, యూఎస్ ఎఫ్‌డిఏ ప్రమాణాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. డ్రగ్ డెవలప్‌మెంట్ ప్రక్రియలోని వివిధ క్లినికల్ దశల్లో మానవ వాలంటీర్లపై పరీక్షలు ఎలా నిర్వహిస్తారో వివరించారు. ఫార్మసీ రంగంలో తనకు 45 సంవత్సరాల అనుభవం ఉందని పేర్కొంటూ, క్వాలిటీ కంట్రోల్ విభాగంలో విద్యార్థులు తప్పనిసరిగా పాటించాల్సిన నియమ నిబంధనలను వివరించారు. ఈ జాతీయ సదస్సుకు కేర్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్ డాక్టర్ డి. సుధీర్ కుమార్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మంజుల, డాక్టర్ స్నిగ్ధ దీప్తి, డాక్టర్ దీప్తి, డాక్టర్ పాడి, డాక్టర్ స్వాతి, వర్షా, డాక్టర్ శ్రీరమ్యతో పాటు ఇతర అధ్యాపక బృందం, పెద్ద సంఖ్యలో విద్యార్థినీ%-%విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సెమినార్ ఫార్మసీ విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి పరిజ్ఞానం అందించడంతో పాటు, పరిశోధన మరియు ఔషధ పరిశ్రమలో ఉన్న అవకాశాలపై స్పష్టమైన దిశానిర్దేశం చేసిన కార్యక్రమంగా నిలిచింది.

## ఇంటర్ కాలేజ్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం





**హన్మకొండ, 29 డిసెంబర్ 2025 (జై భీమ్ న్యూస్)**

వరంగల్ జోన్‌కు చెందిన ఇంటర్ కాలేజ్ క్రికెట్ టోర్నమెంట్ క్రికెట్ పోటీలు కాకతీయ యూనివర్సిటీ యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డ్ ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలు యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో ఉత్సాహభరిత వాతావరణంలో మొదలయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డ్ డైరెక్టర్ ప్రొఫెసర్ వి. వెంకయ్య టోర్నమెంట్‌ను అధికారికంగా ప్రారంభించి క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు. ఇంటర్ కాలేజ్ స్థాయిలో జరుగుతున్న ఈ పోటీలు విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలను వెలికితీయడానికి వేదికగా నిలుస్తాయని తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో ప్రతిభ కనబరిచి వరంగల్ జోన్ క్రికెట్ జట్టుకు ఎంపికై, తదుపరి దశలో కాకతీయ యూనివర్సిటీ జట్టుకు సెలెక్ట్ కావాలని క్రీడాకారులకు ఆకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ మాజీ కార్యదర్శి మార్నేని ఉదయభాను రావు, యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ డా. పి. భాస్కర్, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగానికి చెందిన డా. ఏటివిటీ ప్రసాద్, యూనివర్సిటీ కాలేజ్ ఫిజికల్ డైరెక్టర్ డా. ఎస్. కుమారస్వామిలు పాల్గొని క్రీడాకారులను ప్రోత్సహించారు. క్రీడల ద్వారా శారీరక ఆరోగ్యం, క్రమశిక్షణ, జట్టు భావన పెరుగుతాయని వారు పేర్కొన్నారు. అలాగే టోర్నమెంట్‌ను సమర్థవంతంగా నిర్వహించడంలో ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు మహమ్మద్ అఫ్జల్, మట్టెడ కుమార్, మహమ్మద్ అలీ, ఎర్ర సుమన్లతో పాటు పీడీలు డా. ఎం. శ్రీనివాస్ రెడ్డి, డా. జి. శశికాంత్ కీలక పాత్ర పోషించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన వివిధ కళాశాలల జట్లు ఈ పోటీల్లో పాల్గొంటుండటంతో, మైదానంలో పోటీ వాతావరణం నెలకొంది. ఈ ఇంటర్ కాలేజ్ టోర్నమెంట్ ద్వారా ప్రతిభావంతులైన క్రీడాకారులు గుర్తింపునకు రావడం తో పాటు, వరంగల్ జోన్ క్రికెట్‌కు మరింత బలం చేకూరుతుందని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## క్రీడలతోనే సత్ప్రవర్తన - ఎస్ఐ దిలీప్




**ధర్మసాగర్, 29 డిసెంబర్ 2025 (జై భీమ్ న్యూస్)**

క్రీడల ద్వారానే సత్ప్రవర్తన సాధ్యమని దిలీప్ అన్నారు. సోమవారం ధర్మసాగర్, వేలేరు బ్లాక్ లెవెల్ మీట్ క్రీడా పోటీలు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజ్ ఆవరణలో మేర యువభారత్ వరంగల్ కేంద్రం ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమాన్ని ధర్మసాగర్ ఎస్సై దిలీప్, జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ధర్మసాగర్ సర్పంచ్ మాచర్ల జ్యోతి ఏలియాలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై దిలీప్ మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా సన్మార్గంలో ప్రయాణించేందుకు క్రీడలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. నేటి సమాజంలో కొందరు యువకులు వ్యసనాల బారిన పడి తమ భవిష్యత్తును దెబ్బతీసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి అవసరమైతే మందలించి, క్రమశిక్షణతో పెంచేవారని గుర్తుచేశారు. ప్రస్తుతం అలాంటి పర్యవేక్షణ కొరవడటంతో చిన్ననాటి నుంచే క్రమశిక్షణ లోపించి, సమాజానికి విఘాతం కలిగించే దారిలో కొందరు యువత సాగుతున్నారని అన్నారు. ఇప్పటికైనా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజం సమన్వయంతో పిల్లలను సత్ప్రవర్తన కలిగిన యువకులుగా తీర్చిదిద్దేందుకు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. క్రీడలు శారీరక ఆరోగ్యంతో పాటు క్రమశిక్షణ, జట్టు భావన, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో మేర యువభారత్ వాలంటీర్ మంద రాజేష్, ఈసంపల్లి రమేష్, పీడీ శ్రీనాథ్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉపాధ్యాయులు ప్రభాకర్, భాస్కర్, గణేష్, వేణు, గోపాలకృష్ణ, బాబురావు, మంజుల, రవళి తదితరులు పాల్గొన్నారు. అలాగే యూత్ సభ్యులు, పెద్ద సంఖ్యలో యువత హాజరై క్రీడా పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE

# కేయూలో వీర్ బాల్ దివస్ పోస్టర్ ఆవిష్కరణ

**విద్యార్థుల్లో ధైర్యం, త్యాగ భావన పెంపొందాలి : ప్రో. వి. రామచంద్రం**



**హన్మకొండ, 29 డిసెంబర్ 2025 (జై భీమ్ న్యూస్)**

విద్యార్థుల్లో ధైర్యం, త్యాగం, జాతీయతా భావం పెంపొందించాల్సిన అవసరం ఉందని ప్రో. వి. రామచంద్రం, కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ అన్నారు. కాకతీయ యూనివర్సిటీ డీన్ స్టూడెంట్ అఫైర్స్, సోషాలజీ, సోషల్ వర్క్ విభాగాలు సంయుక్తంగా జనవరి 3, 2026న నిర్వహించనున్న "వీర్ బాల్ దివస్" కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను సోమవారం యూనివర్సిటీలో ఘనంగా ఆవిష్కరించారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో డీన్ స్టూడెంట్ అఫైర్స్ ప్రో. మామిడాల ఇస్తారి, కేయూ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రో. తాళ్ళపల్లి మనోహర్, సోషాలజీ %డ% సోషల్ వర్క్ విభాగాధిపతి డా. ఎం. స్వర్ణలత, ఆ విభాగపు ఆచార్యులు డా. కే. సుభాష్, డా. కే. ప్రసన్న, డా. ఎస్. సాహితీ, ఎం. జాస్మిన్, బి. రజిత, అలాగే ఎన్.ఎస్.ఎస్ కోఆర్డినేటర్ ప్రో. ఈసం నారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రో. వి. రామచంద్రం మాట్లాడుతూ, భారత ప్రభుత్వ మహిళా మరియు శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు దేశం కోసం, ధర్మం కోసం కేవలం ఏడేళ్ల వయసులోనే ప్రాణాలను త్యాగం చేసిన వీర బాలులు జోరావర్ సింగ్, ఫతే సింగ్ల స్మారకార్థంగా "వీర్ బాల్ దివస్"ను జనవరి 3న కాకతీయ యూనివర్సిటీ సెనెట్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డీన్ స్టూడెంట్ అఫైర్స్ ప్రో. మామిడాల ఇస్తారి, విభాగాధిపతి డా. స్వర్ణలత మాట్లాడుతూఈ కార్యక్రమంలో మధ్యాహ్నం 2.00 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు "వీర్ బాల్ దివస్ %-% జాతి నిర్మాణానికి స్ఫూర్తి" అనే అంశంపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని అన్ని అనుబంధ కళాశాలల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని, రిజిస్ట్రేషన్‌కు జనవరి 2, 2026 చివరి తేదీగా నిర్ణయించామని వెల్లడించారు. రిజిస్ట్రేషన్ కోసం యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు. కాకతీయ యూనివర్సిటీ గోల్డెన్ జూబిలీ వేడుకలలో భాగంగా నిర్వహిస్తున్న ఈ "వీర్ బాల్ దివస్" కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో ధైర్యం, త్యాగం, దేశభక్తి వంటి విలువలను పెంపొందించడమే ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.

# పదవ తరగతి విద్యార్థులకు గణిత ప్రతిభ పరీక్ష

**హనుమకొండ రీజినల్ సైన్స్ సెంటర్లో నిర్వహణ**



**హన్మకొండ, 29 డిసెంబర్ 2025 (జై భీమ్ న్యూస్)**

పదవ తరగతి విద్యార్థుల్లో గణిత ప్రతిభను వెలికితీయాలనే ఉద్దేశంతో ఎస్సీఈఆర్టీ తెలంగాణ డైరెక్టర్ ఆదేశాల మేరకు, తెలంగాణ గణిత ఫోరం ఆధ్వర్యంలో గణిత ప్రతిభ పరీక్షను రేపు అనగా 30 డిసెంబర్ 2025 (మంగళవారం) నిర్వహించనున్నారు. ఈ పరీక్ష ఉదయం 10.00 గంటల నుంచి రీజినల్ సైన్స్ సెంటర్లో జరుగనుంది. విద్యార్థుల్లో గణితం పట్ల ఆసక్తి, జిజ్ఞాస పెంపొందించడంతో పాటు ఈ అంశంలో మరింత రాణించేందుకు ఇలాంటి టాలెంట్ టెస్టులు ఎంతో ఉపయోగపడతాయని ఎల్.వి. గిరిరాజ్ గౌడ్ పేర్కొన్నారు. పరీక్షకు సంబంధించిన వివరాలు, ప్రతి మండలం నుంచి పాల్గొంటున్న విద్యార్థుల సమాచారం తెలంగాణ గణిత ఫోరం హనుమకొండ జిల్లా శాఖ ప్రతినిధులు జిల్లా విద్యాశాఖ అధికారికి తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా గణిత ఫోరం అధ్యక్షులు బోయినపల్లి మహేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి తౌటం భాస్కర్, జిల్లా ఆర్థిక కార్యదర్శి పుల్లూరి మల్లికార్జున్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ కందగట్ల సురేష్లు పాల్గొన్నారు. ఈ టాలెంట్ టెస్టులో ప్రతి మండలం నుంచి జిల్లా పరిషత్, ప్రభుత్వ పాఠశాలల నుంచి ముగ్గురు విద్యార్థులు, రెసిడెన్షియల్ విభాగం నుంచి ముగ్గురు విద్యార్థులు జిల్లా స్థాయిలో పాల్గొంటున్నారు. మండల స్థాయిలో నిర్వహించిన ప్రతిభ పరీక్షలలో ఎంపికైన మొత్తం 88 మంది విద్యార్థులు జిల్లా స్థాయి పరీక్షకు హాజరవుతున్నారు. అలాగే తెలుగు, ఉర్దూ మీడియం విద్యార్థులు నేరుగా జిల్లా స్థాయి గణిత ప్రతిభ పరీక్షలో పాల్గొంటారు. పరీక్షలో పాల్గొనే అందరు విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఐదుగురికి జైలు శిక్ష

**కాజీపేట, 29 డిసెంబర్ 2025 (జై భీమ్ న్యూస్)**

వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు, అదనపు డీసీపీ (ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్) రాయల ప్రభాకర్ రావు సూచనలతో, ట్రాఫిక్ ఏసీపీ టి. సత్యనారాయణ పర్యవేక్షణలో కాజీపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 08 మంది వ్యక్తులు పట్టుబడగా, వారిలో 05 మంది మోతాదుకు మించి మద్యం సేవించినట్లు నిర్ధారణ అయ్యింది. వారిని గౌరవ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎస్. ఫాతిమా చిన్నప్ప ఎదుట హాజరుపరచగా, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఐదుగురికి రెండు రోజుల జైలు శిక్ష విధించారు. జైలు శిక్ష విధించబడిన వారిలో బానోతు తిరుపతి (తండ్రి రంధన్), బానోతు తిరుపతి (తండ్రి చాప్లా), ఎమ్.డి. అక్బర్, కందికట్ల గణేష్, కుర్ర సందీప్ లను హుజురాబాద్ సబ్ జైలుకు తరలించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు, ప్రాణనష్టం సంభవించే ప్రమాదం ఉన్నందున, ఇలాంటి ఘటనలపై కఠిన చర్యలు కొనసాగుతాయని పోలీసులు తెలిపారు. ఈ తనిఖీలను కాజీపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సీఐ పి. వెంకన్న ఆధ్వర్యంలో నిర్వహించారు.

# హుజూరాబాద్ ఎంఈఓపై ఫిర్యాదుకు స్పందించిన మానవ హక్కుల కమిషన్

**కేసు నమోదు.. త్వరలో నోటీసులు, విచారణ**
**ఆల్ ఇండియా స్టూడెంట్స్ బ్లాక్ తెలంగాణ రాష్ట్ర కన్వీనింగ్ కమిటీ సభ్యుడు కొలుగూరి సూర్యకిరణ్**

**హుజూరాబాద్, 29 డిసెంబర్ 2025 (జై భీమ్ న్యూస్)**

హుజూరాబాద్ మండల విద్యాధికారి (ఎంఈఓ)పై చేసిన ఫిర్యాదుకు రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ స్పందించి కేసు నమోదు చేసినట్లు ఆల్ ఇండియా స్టూడెంట్స్ బ్లాక్ తెలంగాణ రాష్ట్ర కన్వీనింగ్ కమిటీ సభ్యుడు కొలుగూరి సూర్యకిరణ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హుజూరాబాద్ మండల విద్యాధికారి విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే ఉద్దేశంతో ఉద్యోగాలు కల్పిస్తే, సదరు అధికారి ఆ ఆశయాలను తుంగలో తొక్కుతూ తన కార్యాలయ అవసరాల కోసం కీలకమైన గణితం బోధించాల్సిన ఉపాధ్యాయుడిని వినియోగించుకున్నారని పేర్కొన్నారు. ఈ కారణంగా పేద విద్యార్థులు గత రెండు సంవత్సరాలుగా గణిత విద్యకు దూరమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై హుజూరాబాద్ మండల విద్యాధికారి, గోపాల్ రెడ్డి అనే ఉపాధ్యాయుడిపై తాను గత కొన్ని రోజులుగా పోరాటం చేస్తున్నానని సూర్యకిరణ్ తెలిపారు. ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు, ప్రాంతీయ సంయుక్త సంచాలకులు (వరంగల్)కు, అలాగే పాఠశాల విద్యాశాఖ కమిషనర్, డైరెక్టర్‌కు ఫిర్యాదులు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దారుణమని విమర్శించారు. చివరకు విద్యార్థుల విద్యా హక్కు హరణ అంశాన్ని దృష్టిలో ఉంచుకుని మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించగా, కమిషన్ స్పందించి ఎస్‌హెచ్‌ఆర్‌సీ డైరీ నంబర్ 7146/సీఆర్/2025, కేసు నంబర్ 3874/36/2/2025 కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. త్వరలో సంబంధిత అధికారులకు నోటీసులు జారీ చేసి విచారణ చేపట్టనున్నట్లు కమిషన్ నుంచి సమాచారం అందిందన్నారు. ఈ వ్యవహారాన్ని తేలికగా వదిలిపెట్టే ప్రసక్తి లేదని, విద్యార్థులకు నష్టం కలిగించిన సదరు అధికారి, ఉద్యోగిపై చర్యలు తీసుకునే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. అవసరమైతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తానని, లోకాయుక్తలో కూడా ఫిర్యాదు చేస్తానని కొలుగూరి సూర్యకిరణ్ వెల్లడించారు. పేద విద్యార్థుల హక్కుల పరిరక్షణలో స్పందించిన మానవ హక్కుల కమిషన్‌కు ఆయన ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.



# టీజీ ఎడ్‌సెట్-2026 కన్వీనర్‌గా ఆచార్య బి. వెంకట్రామరెడ్డి నియామకం

**వరంగల్, 29 డిసెంబర్ 2025 (జై భీమ్ న్యూస్)**



2026-27 విద్యా సంవత్సరానికి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్న కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ టీజీ ఎడ్‌సెట్%-%2026కు కన్వీనర్‌గా వరంగల్‌లోని కాకతీయ యూనివర్సిటీ భౌతిక శాస్త్ర విభాగ ఆచార్యులు ఆచార్య బి. వెంకట్రామరెడ్డిని నియమిస్తూ తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ ఆచార్య వి. బాలకిష్టా రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. గమనార్హంగా, 2025 సంవత్సరానికి కూడా ఆచార్య వెంకట్రామరెడ్డి టీజీ ఎడ్‌సెట్ కన్వీనర్‌గా విజయవంతంగా విధులు నిర్వహించారు. అదే అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని, 2026 సంవత్సరానికి మళ్లీ ఆయనకే బాధ్యతలు అప్పగించినట్లు సమాచారం. ఈ నియామకంపై యూనివర్సిటీకి చెందిన పలువురు బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు ఆచార్య బి. వెంకట్రామరెడ్డిని అభినందించారు. టీజీ ఎడ్‌సెట్%-%2026ను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహిస్తారని వారు విశ్వాసం వ్యక్తం చేశారు.

# జనవరి 18న వరంగల్లో నేతకాని భారీ బహిరంగ సభ

**సభను జయప్రదం చేయాలి.. నేతకాని విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోగు సుధాకర్**




**హన్మకొండ, 29 డిసెంబర్ 2025 (జై భీమ్ న్యూస్)**

జనవరి 18న వరంగల్ నగరంలోని కేడీసీ గ్రౌండ్స్‌లో నేతకాని ప్రజలతో భారీ బహిరంగ సభను నిర్వహించనున్నట్లు నేతకాని విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోగు సుధాకర్ తెలిపారు. ఈ సభను వేలాదిమంది పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా హన్మకొండలోని సుబేదారిలో నేతకాని ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని గోగు సుధాకర్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో మాట్లాడిన ఆయనునేతకాని కులస్తులు ఏజెన్సీ ప్రాంతాల్లో, ముఖ్యంగా గోదావరి పరివాహక ప్రాంతంలో ఆదివాసీ ప్రజలతో కలిసి తరతరాలుగా జీవనం సాగిస్తున్నప్పటికీ, ఏజెన్సీ ప్రాంతానికి వర్తించే హక్కులు, చట్టాలు తమకు అమలుకావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అభివృద్ధికి దూరంగా, దయనీయ స్థితిలో నేతకాని కులస్తులు జీవిస్తున్నారని అన్నారు. తెలంగాణలో మెజారిటీగా ఉన్నప్పటికీ, నేతకాని కులస్తులు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా తగిన రిజర్వేషన్ ఫలితాలు పొందలేకపోతున్నారని విమర్శించారు. ముఖ్యంగా ప్రభుత్వ రంగ ఉద్యోగాల్లో నేతకాని విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. నేతకాని కులస్తుల సమగ్ర అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.5,000 కోట్లతో ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జనవరి 18న నిర్వహించనున్న ఈ బహిరంగ సభలో నేతకాని ప్రజలంతా భారీ సంఖ్యలో పాల్గొని తమ హక్కుల కోసం గళం వినిపించాలని గోగు సుధాకర్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జాడి రాంబాబు, జిమ్మిడి గోపాల్, గోగు అనిల్, జనగాం రంజిత్, సతీష్ రాజు, వెంకన్న, సంతోష్ తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# యాసంగి అవసరాలకు సరిపడా యూరియా నిల్వలు

**రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు**
**జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.**

**ములుగు, 29 డిసెంబర్ 2025 (జై భీమ్ న్యూస్)**



ప్రస్తుత యాసంగి (రబీ) సీజన్‌లో పంటల సాగుకు అవసరమైనంత యూరియా నిల్వలు జిల్లాలో పూర్తిగా అందుబాటులో ఉన్నాయని, రైతులు ఎలాంటి ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఎక్కడా రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ఎరువుల పంపిణీ సాఫీగా జరిగేలా ప్రణాళికాబద్ధమైన చర్యలు చేపట్టామని ఆయన చెప్పారు. అన్ని సహకార సంఘాల్లో యూరియా సహా ఇతర ఎరువులు అందుబాటులో ఉంచి, పంట సాగు చేస్తున్న ప్రతి రైతుకు అందేలా పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు. యాసంగి సీజన్‌లో జిల్లాకు మొత్తం 17,000 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉండగా, ప్రస్తుతం 9,972 మెట్రిక్ టన్నుల నిల్వలు ఉన్నాయని తెలిపారు. అక్టోబర్ 1 నుంచి ఇప్పటివరకు 9,945 మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు పంపిణీ చేసినట్లు వివరించారు. అదనంగా 2,381 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీకి సిద్ధంగా ఉందన్నారు. యూరియాతో పాటు జిల్లాలో కాంప్లెక్స్ ఎరువులు 3,213 మెట్రిక్ టన్నులు, డీఏపీ 864 మెట్రిక్ టన్నులు, ఎంఓపీ 404 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. పంపిణీ కేంద్రాల్లో కౌంటర్లు ఏర్పాటు చేసి రైతులు వచ్చిన వెంటనే ఎరువులు అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. యూరియా పంపిణీ ప్రక్రియను ప్రతిరోజూ పర్యవేక్షిస్తున్నామని, లోటుపాట్లకు తావులేకుండా పకడ్బందీగా వ్యవహరిస్తున్నామని చెప్పారు. రైతులు సరఫరాలో సమస్యలు ఎదుర్కొంటే సమీప వ్యవసాయ అధికారులను సంప్రదించాలని సూచించారు. అవసరానికి మించి ఒకేసారి కొనుగోలు చేయకుండా శాస్త్రీయ పద్ధతిలో అవసరమైనంత మాత్రమే వినియోగించాలని రైతులను కోరారు. ఎరువుల కృత్రిమ కొరత సృష్టించడం, అధిక ధరలకు విక్రయించడం, దారి మళ్లించడం వంటి అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని, నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులు, సిబ్బందిపైనా చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు.

# గోపాల్‌పూర్ రోడ్డులో ఆక్రమణల తొలగింపు

**హన్మకొండ, 29 డిసెంబర్ 2025 (జై భీమ్ క్రైమ్ న్యూస్)**

గోపాల్‌పూర్ క్రాస్ రోడ్ నుంచి గోపాలపురం వెళ్లే ప్రధాన రహదారిపై ఏర్పడుతున్న ట్రాఫిక్ అడ్డంకులను తొలగించేందుకు హనుమకొండ ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. ఈ చర్యలను ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సీతారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ మార్గంలో రోడ్డును ఆక్రమించి ఏర్పాటు చేసిన సైన్‌బోర్డులు, అక్రమ షెడ్డులు వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నాయని గుర్తించిన పోలీసులు, వాటిని తొలగించారు. ఇటీవల ఈ రహదారిపై ట్రాఫిక్ రద్దీ గణనీయంగా పెరగడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తూ రోడ్డును ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. ప్రజలు సహకరించి రోడ్లపై అక్రమ ఆక్రమణలు చేయకుండా, ట్రాఫిక్ నియమాలను పాటించాలని సూచించారు. ఈ ప్రత్యేక డ్రైవ్‌తో గోపాల్‌పూర్%-%గోపాలపురం మార్గంలో ట్రాఫిక్ సమస్యలు కొంత మేర తగ్గే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు.



# లైబ్రరీ అసిస్టెంట్ ఇజాక్ ప్రభాకర్‌కు ఘన సన్మానం

**"గ్రంథాలయం దేవాలయం.. గ్రంథ పాలకుడు పూజారి"**
**ఆచార్య ఎన్. వాసుదేవ రెడ్డి**



**హన్మకొండ, 29 డిసెంబర్ 2025 (జై భీమ్ న్యూస్)**

"గ్రంథాలయం దేవాలయం వంటిది, గ్రంథ పాలకుడు పూజారి లాంటివాడు" అని కాకతీయ యూనివర్సిటీ అభివృద్ధి అధికారి, రసాయన శాస్త్ర విభాగాధిపతి ఆచార్య ఎన్. వాసుదేవ రెడ్డి అన్నారు. విశ్వవిద్యాలయ కేంద్ర గ్రంథాలయంలో లైబ్రరీ అసిస్టెంట్‌గా సేవలందించి ఉద్యోగ విరమణ పొందుతున్న ఇజాక్ ప్రభాకర్కు వీడ్కోలు సమావేశం సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కేంద్ర గ్రంథాలయంలో లైబ్రరీ అసిస్టెంట్ తేజావత్ జావేర్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆచార్య వాసుదేవ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల విద్యాభివృద్ధికి, అధ్యాపకుల బోధనకు గ్రంథాలయం కీలక వారధిగా నిలుస్తుందని తెలిపారు. విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు అందించడం, సమాచార శోధనలో సహకరించడం, పరిశోధనకు దోహదపడే మార్గనిర్దేశం చేయడంలో లైబ్రరీ అసిస్టెంట్ల పాత్ర అత్యంత ముఖ్యమని కొనియాడారు. అలాగే నిర్మల్ పీజీ కాలేజీ, ఇంజనీరింగ్ కాలేజీ (కో-ఎడ్యుకేషన్) గ్రంథాలయాల్లో ఇజాక్ ప్రభాకర్ అందించిన సేవలను ఈ సందర్భంగా ఆయన స్మరించుకున్నారు. విద్యార్థులు, అధ్యాపకులకు ఎల్లప్పుడూ సహకరించే స్వభావంతో ఆయన చేసిన సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అతిథిగా పాల్గొన్న అధికారుల సంఘ అధ్యక్షురాలు డాక్టర్ ఎస్. సుజాత మాట్లాడుతూగ్రంథాలయాలను సమర్థవంతంగా వినియోగించుకునేలా విద్యార్థులను ప్రోత్సహించడంలో, అవసరమైన సమాచారాన్ని వారికి చేరువ చేయడంలో లైబ్రరీ అసిస్టెంట్ల పాత్ర అమూల్యమని అన్నారు. ఈ సమావేశంలో బోధన, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ఉద్యోగ విరమణ పొందుతున్న ఇజాక్ ప్రభాకర్ను శాలువా, జ్ఞాపికతో ఘనంగా సన్మానించి, ఆయనకు భవిష్యత్తులో ఆరోగ్యకరమైన, సుఖసంతోషాలతో నిండిన జీవితం కలగాలని ఆకాంక్షించారు.

# నిజాయితీ చాటిన ఆటో డ్రైవర్, ట్రాఫిక్ కానిస్టేబుల్

**పోయిన బ్యాగ్‌ను యజమానికి అందించిన ఆటో డ్రైవర్, ట్రాఫిక్ కానిస్టేబుల్**



**హనుమకొండ, 29 డిసెంబర్ 2025 (జై భీమ్ న్యూస్)**

ఈ నెల 29న ఉదయం 08:30 గంటల సమయంలో నక్కలగుట్ట నుంచి కాజిపేట్ వెళ్లే మార్గంలో మానవత్వాన్ని చాటుకున్న సంఘటన చోటుచేసుకుంది. నక్కలగుట్ట వాటర్ ట్యాంక్ ఏరియాకు చెందిన దండ్రే శైలజ (భర్త: గోవర్ధన్) తన ఆక్టివా ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తుండగా, ఫాతిమా ఏరియా వద్ద ఆమె బ్యాగ్ అనుకోకుండా పడిపోయింది. ఆ సమయంలో అక్కడే ఉన్న ఆటో డ్రైవర్ బానోత్ శంకర్ (తండ్రి: భాష్య, గోపాలపూర్, హనుమకొండ)కు ఆ బ్యాగ్ దొరికింది. నిజాయితీతో వ్యవహరించిన శంకర్ వెంటనే అక్కడ ట్రాఫిక్ విధుల్లో ఉన్న పోలీస్ కానిస్టేబుల్ భూక్యా గణేష్కు ఆ బ్యాగ్‌ను అందజేశారు. అనంతరం కానిస్టేబుల్ గణేష్ బ్యాగ్‌లో ఉన్న వివరాల ఆధారంగా యజమాని శైలజ టీచర్ చిరునామాను గుర్తించి, తక్షణమే ఆమెకు బ్యాగ్‌ను సురక్షితంగా అప్పగించారు. ఆ బ్యాగ్‌లో సెల్ ఫోన్, ఐడి కార్డు, ఏటీఎం కార్డులుతో పాటు మరికొన్ని విలువైన వస్తువులు ఉన్నట్లు తెలిసింది. ఈ సంఘటనలో నిజాయితీతో వ్యవహరించిన ఆటో డ్రైవర్ బానోత్ శంకర్‌ను, బాధ్యతాయుతంగా స్పందించిన ట్రాఫిక్ కానిస్టేబుల్ భూక్యా గణేష్‌ను పి. వెంకన్న, కాజిపేట్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్, ప్రత్యేకంగా అభినందించారు. ఈ ఘటన సమాజంలో నిజాయితీ, బాధ్యతా భావం ఇంకా బతికే ఉన్నాయనడానికి నిదర్శనంగా నిలిచిందని పలువురు ప్రశంసలు కురిపించారు.

# పాఠశాలే గ్రామ భవిష్యత్తు

**అంబాల జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులతో స్నేహపూర్వక సంభాషణ**





**హన్మకొండ జిల్లా, 29 డిసెంబర్ 2025 (జై భీమ్ న్యూస్)**

కమలాపూర్ మండలం అంబాల గ్రామంలోని జిల్లా ప్రజా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల (జెడ్పీహెచ్‌ఎస్)ను గ్రామ సర్పంచ్ కుమారస్వామి, ఉపసర్పంచ్ శ్రవణ్ కుమార్ యాదవ్ సందర్శించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థినీ%-%విద్యార్థులతో స్నేహపూర్వకంగా మమేకమై మాట్లాడుతూ, వారి చదువులు, పాఠశాల వాతావరణం, అందుబాటులో ఉన్న సౌకర్యాలపై వివరంగా ఆరా తీశారు. ఉపసర్పంచ్ శ్రవణ్ కుమార్ యాదవ్ విద్యార్థుల అభ్యాస స్థాయి, ఉపాధ్యాయుల సహకారం, పాఠ్యపుస్తకాల అందుబాటు వంటి అంశాలపై ప్రశ్నలు వేసి తెలుసుకున్నారు. అలాగే మధ్యాహ్న భోజన పథకం అమలుపై విద్యార్థుల నుంచి నేరుగా అభిప్రాయాలు సేకరించారు. ఈ సందర్భంగా భోజన నాణ్యతపై కొంత అసంతృప్తి వ్యక్తమవడంతో, సంబంధిత అధికారుల దృష్టికి వెంటనే తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. సర్పంచ్ కుమారస్వామి మాట్లాడుతూ, పాఠశాల విద్యే గ్రామ భవిష్యత్తుకు బలమైన పునాది అని పేర్కొన్నారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు గ్రామ పాలన ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని తెలిపారు. విద్యార్థులు శ్రద్ధగా చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ప్రోత్సహించారు. అలాగే పలువురు జాతీయ నాయకులు, దేశ నాయకులు, జనరల్ నాలెడ్జ్ అంశాలపై విద్యార్థులను ప్రశ్నిస్తూ వారి అవగాహనను పరిశీలించారు. ముఖ్యంగా భారత రాజ్యాంగ ప్రాముఖ్యతను వివరిస్తూ, రాజ్యాంగం దేశానికి మార్గదర్శక గ్రంథమని, పౌరుల హక్కులు%-%విధులు అందులో స్పష్టంగా పొందుపరచబడ్డాయని తెలిపారు. రాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్. అంబేద్కర్ చేసిన కృషిని వివరించి, రాజ్యాంగ విలువలను గౌరవిస్తూ మంచి పౌరులుగా ఎదగాలని సూచించారు. దీనిపై విద్యార్థులు ఉత్సాహంగా స్పందించి సమాధానాలు ఇవ్వడం విశేషం. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రోజా రాణి, సంపత్‌తో పాటు సిబ్బంది పాల్గొని, పాఠశాల అభివృద్ధికి అవసరమైన అంశాలను సర్పంచ్%-%ఉపసర్పంచ్‌లకు వివరించారు.

# ఈ నెల 31న కేయూ సెల్ట్ 6 వారాల తరగతుల ముగింపు సమావేశం

**హనుమకొండ, (జై భీమ్ న్యూస్)**

కాకతీయ విశ్వవిద్యాలయంకు చెందిన సెంటర్ ఫర్ ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచింగ్ (సి.ఈ.ఎల్.టి) ఆధ్వర్యంలో నిర్వహించిన 6 వారాల ఇంగ్లీష్ భాషా శిక్షణ తరగతుల ముగింపు సమావేశాన్ని ఈ నెల 31వ తేదీ (బుధవారం) మధ్యాహ్నం 12.00 గంటలకు విశ్వవిద్యాలయంలోని ఇంగ్లీష్ విభాగ సెమినార్ హాల్‌లో నిర్వహించనున్నట్లు సెల్ట్ డైరెక్టర్ డాక్టర్ ఆర్. మేఘనా రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో శిక్షణ పూర్తిచేసుకున్న విద్యార్థులందరూ తప్పనిసరిగా హాజరు కావాలని, ఈ సందర్భంగా వారికి సర్టిఫికెట్ల ప్రదానం కూడా జరుగుతుందని తెలిపారు. అలాగే ఈ సమావేశానికి విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు, అధ్యాపకులు హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తారని వెల్లడించారు. ఇంగ్లీష్ భాషా నైపుణ్యాలను మెరుగుపరచుకునేందుకు సెల్ట్ నిర్వహించిన ఈ తరగతులు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా నిలిచాయని పేర్కొంటూ, ముగింపు సమావేశంలో ప్రతి విద్యార్థి విధిగా పాల్గొనాలని డైరెక్టర్ డా. మేఘనా రావు ఒక ప్రకటనలో కోరారు.

# చైనా మాంజా విక్రయించినా, వినియోగించినా జైలు తప్పదు

**మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. శబరీష్ హెచ్చరిక**

**మహబూబాబాద్, (జై భీమ్ న్యూస్)**



మహబూబాబాద్ జిల్లా పరిధిలో నిషేధిత చైనా మాంజా విక్రయం లేదా వినియోగానికి పాల్పడితే కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ డా. శబరీష్ స్పష్టం చేశారు. సంక్రాంతి పండుగ సమీపిస్తున్న నేపథ్యంలో గాలిపటాల ఎగరవేతకు యువత సిద్ధమవుతున్న తరుణంలో, ప్రమాదకరమైన చైనా మాంజా వినియోగం పెరిగే అవకాశాలున్నాయని పేర్కొంటూ ముందస్తు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. చైనా మాంజా (సింథటిక్/నైలాన్ దారం, గాజు పొడి కలిపిన దారం) వినియోగం వల్ల పక్షుల మెడలు, రెక్కలు కోసుకుపోవడం, ద్విచక్ర వాహనదారులు తీవ్రంగా గాయపడటం, కొన్ని సందర్భాల్లో ప్రాణనష్టం కూడా సంభవించే ప్రమాదం ఉందని ఎస్పీ వివరించారు. ప్రజల ప్రాణాలకు తీవ్ర ముప్పుగా మారిన ఈ నిషేధిత మాంజాను ఎవరైనా విక్రయించినా లేదా వినియోగించినా చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. చైనా మాంజా విక్రయం లేదా వినియోగంలో పాల్గొన్న వారికి ఏడేళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉందని, ఇది పూర్తిగా చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు. నిషేధిత మాంజా నిల్వలు, విక్రయాలపై జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు చైనా మాంజాను పూర్తిగా నివారించి, ప్రభుత్వ అనుమతితో ఉన్న కాటన్ దారాలతో మాత్రమే గాలిపటాలు ఎగరవేయాలని జిల్లా ఎస్పీ సూచించారు. ఎవరైనా చైనా మాంజా విక్రయిస్తున్నట్లు లేదా వినియోగిస్తున్నట్లు సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలను కోరారు.

# వ్యవసాయ సాగుకు అవసరమైన యూరియా సమృద్ధిగా అందుబాటులో ఉంది

**రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు**



**హన్మకొండ, డిసెంబర్ 29, 2025 (జై భీమ్ న్యూస్)**



రాష్ట్రంలో వ్యవసాయ సాగుకు అవసరమైన యూరియా సమృద్ధిగా అందుబాటులో ఉందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు స్పష్టం చేశారు. సోమవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, వ్యవసాయ శాఖ రాష్ట్ర ముఖ్య కార్యదర్శి సభ్యసాచి గోష్, రాష్ట్ర వ్యవసాయ కార్యదర్శి కె. సురేంద్రమోహన్లతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, వ్యవసాయ, సహకార శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కార్యాచరణ ప్రణాళిక ప్రకారం రైతులకు యూరియా పంపిణీ చేయాలని ఆదేశించారు. ఇందుకోసం ప్రభుత్వం ప్రత్యేకంగా యూరియా యాప్ రూపొందించిందని, పైలట్ ప్రాజెక్ట్‌గా పెద్దపల్లి, నల్గొండ, జనగామ, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో తొలిదశలో అమలు చేయనున్నట్లు తెలిపారు. ఆయా జిల్లాల్లో యాప్ అమలుపై రైతుల అభిప్రాయాలు తెలుసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. యూరియా పంపిణీ కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నీడ, త్రాగునీరు తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని తెలిపారు. యూరియా సరఫరాలో అవకతవకలు జరగకుండా ప్రత్యేక అధికారులను నియమించి నిరంతర పర్యవేక్షణ చేపడతామని స్పష్టం చేశారు. రైతుల సౌకర్యార్థం రాష్ట్రస్థాయిలో టోల్ ఫ్రీ నంబర్ 1800 599 5770 ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. జిల్లా స్థాయిలో హెల్ప్‌లైన్ నంబర్లు ఏర్పాటు చేసి, యూరియా పంపిణీ, రవాణాపై టాస్క్‌ఫోర్స్ బృందాలు పర్యవేక్షణ చేయాలని సూచించారు. పట్టాదారు పాసుపుస్తకంలో నమోదైన భూ విస్తీర్ణం మేరకే రైతులకు యూరియా పంపిణీ చేయాలని, అవసరానికి మించి ఎట్టి పరిస్థితుల్లోనూ ఇవ్వవద్దని మంత్రి ఆదేశించారు.

# ఏటీఎం కేంద్రాల్లో చోరీలు.. సీసీ కెమెరాల్లో రికార్డైన దృశ్యాలు విడుదల




**వరంగల్, 29 డిసెంబర్ 2025 (జై భీమ్ క్రైమ్ న్యూస్)**

ట్రై సిటీ పరిధిలోని పలు ఏటీఎం కేంద్రాల్లో చోరీలకు పాల్పడుతున్న ముఠా సభ్యులు, ఏటీఎం మిషన్లను ఏ విధంగా ట్యాంపరింగ్ చేసి నగదు దోచుకుంటున్నారో స్పష్టంగా చూపించే సీసీ కెమెరా దృశ్యాలను పోలీసులు విడుదల చేశారు. ఏటీఎం సెంటర్లలో అమర్చిన సీసీ కెమెరాల్లో నమోదైన ఈ దృశ్యాల్లో, నిందితులు ముందుగా ఏటీఎం యంత్రాల డిస్పెన్సింగ్ స్లాట్ వద్ద ప్రత్యేకంగా తయారు చేసిన ఐరన్ ప్లేట్లు అమర్చి, వినియోగదారులకు నగదు బయటకు రాకుండా అడ్డుపెట్టి, అనంతరం అవకాశం చూసి నగదును దోచుకున్న విధానం స్పష్టంగా కనిపిస్తోంది. ఈ చోరీలకు పాల్పడిన రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన ఏడుగురు సభ్యుల అంతర్‌రాష్ట్ర ముఠాను నిన్నటి రోజున సీసీఎస్, కాజీపేట పోలీసులు సంయుక్తంగా అరెస్ట్ చేశారు. వారి నుంచి భారీ మొత్తంలో నగదు, చోరీలకు ఉపయోగించిన పరికరాలు, వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఏటీఎం నుంచి నగదు బయటకు రాకపోతే వెంటనే బ్యాంకు లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలని పోలీసులు సూచించారు. అలాగే ఏటీఎం కేంద్రాల్లో అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే డయల్ 100కు ఫోన్ చేయాలని కోరారు.

# తిమ్మాపూర్ మండల సర్పంచుల ఫోరం

**అధ్యక్షురాలిగా మన్నెంపల్లి సర్పంచ్ పొన్నం సునీత**

**కరీంనగర్,డిసెంబర్29(జై భీమ్ న్యూస్):**

తిమ్మాపూర్ మండల సర్పంచుల ఫోరం నూతన కార్యవర్గాని ఆదివారం మండల సర్పంచుల ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా మన్నెంపల్లి సర్పంచ్ పొన్నం సునీత అనిల్ గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షుడిగా తాట్ల తిరుపతి, గౌరవ సలహాదారురాలిగా సురం స్వప్న మహేందర్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా మామిడి మమతా సతీష్, కనకం లక్ష్మి కొమురయ్య, ప్రధాన కార్యదర్శిగా ఆవుదుర్తి రామకిషన్, కోశాధికారిగా గోదరి శోభారాణి రవి, కార్యదర్శిగా పిస్క సౌజన్య కృష్ణ కిషోర్, దుర్గం శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎలుక ఆంజనేయులు, గుజ్జుల శ్వేత ప్రణీత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఇకపోతే పెద్దపల్లి మండల ఉప సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలిగా తలారి స్వప్న-సాగర్ (అందుగులపల్లి) రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆదివారం జరిగిన సమావేశంలో మెజారిటీ సభ్యుల ఆమోదం మేరకు ఫోరం కమిటీనీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా గుమ్మడి సోని విజయ్ (రాగినేడు), ఉపాధ్యక్షులుగా గున్నాల రాములు (కనగర్తి), కేశవేని అశోక్ యాదవ్ (మూలసాల), గుర్రం శ్రీధర్ (మారేడుగొండ), వంగ అనిల్ (భోజన్నపేట), పాలేటి వెంకటేష్ యాదవ్ (గౌరెడ్డిపేట), ప్రధాన కార్యదర్శులుగా గాజుల ప్రవీణ్ కుమార్ (కాపులపల్లి), కొండ శ్రావణ్ కుమార్ (రంగాపూర్), సిలారపు శ్రీనివాస్ (కొత్తపల్లి), కార్యదర్శులుగా మిట్టపల్లి వెంకటేష్ (పెద్దబొంకూర్) సుద్దాల స్రవంతి వెంకటేష్ (అప్పన్నపేట), బీటి అశోక్ (కుర్మపల్లి), తొగరి రాజేశం (గుర్రాంపల్లి), సంయుక్త కార్యదర్శులుగా పర్స లక్ష్మి-శంకరయ్యయాదవ్ (పెద్దకల్వల), బోయిని ఓదెలు (గోపయ్య పల్లి), కోశాధికారిగా పంబాల రాజు యాదవ్ (బొంపల్లి), సహాయ కార్యదర్శి గా కలవేని అనూష (ముత్తారం), మడుపు జయలక్ష్మి (రాంపల్లి)ని ఎన్నుకున్నారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE సమస్యలపై సమరంగా Jai Bheem TV STRUGGLE FOR JUSTICE సామాన్యుడి ఆయుధంగా

# ప్రాణాంతకంగా చైనా మాంజా

**చైనా మాంజా తగిలి యువకుడి గొంతుకు గాయం**

**హైదరాబాద్,డిసెంబర్ 29(జై భీమ్ న్యూస్):**

హైదరాబాద్ నగరంలో చైనా మాంజా ఆందోళన కలిగిస్తోంది. చైనా మాంజాలు ప్రాణాలు తీస్తున్నాయనే కారణంతో దాని వాడకంపై ప్రభుత్వం నిషేధం విధించింది. అయినప్పటికీ అధికారుల నిర్లక్ష్యం, నిఘా లేకపోవడం వల్ల దానిని అందరూ యథేచ్ఛగా వినియోగిస్తున్నారు. చాలా తక్కువ ధరకే దొరుకుతుండడంతో అందరూ పతంగులు ఎగరేయడానికి చైనా మాంజానే వినియోగిస్తున్నారు. అయితే ఇది చాలా మంది ప్రాణాలు తీస్తోంది. ఇప్పటికే హైదరాబాద్‌లో ఒక వ్యక్తి చైనా మాంజా వల్ల గొంతు కోసుకుపోవడంతో ప్రాణాలు కోల్పోయాడు . తాజాగా మరో వ్యక్తి చైనా మాంజా వల్ల తీవ్ర గాయాలపాలయ్యాడు. హైదరాబాద్ పాతబస్తీ నవాబ్ సాబ్ కుంటకు చెందిన జమీల్ అనే యువకుడు చార్మినార్ వైపు బైక్ వెళుతున్నాడు. శంషీర్ గంజ్ ప్రాంతంలో చైనా మాంజా అతడి గొంతుకు తగిలి కోసుకు పోయింది. దీంతో అతడు తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు వెంటనే అతడిని హాస్పిటల్‌కు తరలించారు. ప్రస్తుతం అతడి పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం.

# ఉద్యోగులకు పిఆర్సి ఏమయ్యింది

**రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కూడా దక్కడం లేదు**
**హరీష్ రావు విమర్శలు**

**హైదరాబాద్,డిసెంబర్ 29(జై భీమ్ న్యూస్):**

బీఆర్ఎస్ హయాంలో ప్రభుత్వ ఉద్యోగులకు ఇయ్యాల్సిన పీఆర్సీ గానీ, డీలు, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌కుసంబంధించిన ఒక్క రూపాయి కూడా పెండింగ్ పెట్టలేదని హరీష్ అసెంబ్లీ వేదికగా స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంమాత్రం ఉద్యోగులకు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఒక్క హామిని కూడా నెరవేర్చలేదని హరీష్ అన్నారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగులు రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందక చాలా ఇబ్బందులు పడుతున్నారని, ఈ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆరోగ్య బాగాలేక ఎంతో మంది చనిపోయారని మాజీ మంత్రి గుర్తు చేశారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇప్పించమని కోర్టుకు వెళ్లినా ఈ సర్కరారు వారిపట్ల కనికరం చూపించలేదన్నారు. ఉద్యోగులు ప్రభుత్వానికి రథ చక్రాల్లాంటివారు, వారు సంతోషంగా ఉంటేనే ప్రభుత్వం నుంచి ప్రజలకు అందాల్సిన సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి కార్యక్రమాలు సజావుగా సాగే అవకాశముంటుందని హరీష్ అన్నారు. కానీ.. ఇవాళ ఈ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు వాళ్లకు రావలిసిన బెనిఫిట్స్ రాక నానా ఇబ్బందులు పడుతున్నారు. తీవ్రమైన మనోవేదనకు గురవుతున్నారు. ఇవాళ రాష్ట్రప్రభుత్వ ఉద్యోగులకు దేశంలో ఎక్కడాలేని విధంగా ఆరు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయి. కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తయినా ఉద్యోగుకలకు పీఆర్సీ ఇవ్వలేదు. గతంలో కేసీఆర్ హయాంలో ఒకసారి 39, మరోసారి 43 శాతం పీఆర్సీ ఇచ్చిన విషయాన్ని హరీష్‌రావు అసెంబ్లీ వేధికగా గుర్తుచేశారు. అదేవిధంగా ఉద్యోగులకు ఈహెచ్ఎస్ (ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్)ను కూడా అమలు చేయాలని, ఉద్యోగులకు జీపీఎఫ్ తదితర బకాయిలన్నీ కూడా తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు ఆయన అన్నారు. అంతేకాక, ఇవాళ రిటైరయిన ఉద్యోగులు తమకు రావలిసిన బెనిఫిట్స్ అందక చాలా ఇబ్బందులకు గురవుతున్నారని, డబ్బులు లేక సరైన వైద్యం అందక దాదాపు 39 మంది రిటైర్డ్ ఉద్యోగులు ప్రాణాలు కోల్పోయారని వెల్లడించారు. బీఆర్ఎస్ హయాంలో సుమారు 15వేల మంది ఉద్యోగులు రిటైరైతే వారందరికీ అందాల్సిన బెనిఫిట్స్ ఒక్క రూపాయి కూడా పెండింగ్ పెట్టకుండా ఇచ్చామని హరీష్ తెలిపారు. అదేవిధంగా సీపీఎస్ పెన్షన్ స్కీమ్‌ను ఓపీఎస్‌గా మారుస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా హామి ఇచ్చిందని, అది ఇప్పటివరకు అమలుకు నోచుకోలేదని, ఎప్పటిలోగా ఓల్డ్‌పెన్షన్ స్కీమును అమలు చేస్తారో చెప్పాలని హరీష్ అడిగారు. గత రెండేళ్లుగా సీపీఎస్ కింద రాష్ట్రప్రభుత్వం కట్టాల్సిన కాంట్రీబ్యూషన్ డబ్బులు కూడా కట్టకుండా వాటిని దారి మళ్లిస్తున్నారని, సీపీఎస్ కట్టకుండా, ఓపీఎస్ అమలు చేయకపోవడంతో రెండు లక్షల మంది సీపీఎస్ ఉద్యోగుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని, దయచేసి సీపీఎస్ కాంట్రిబ్యూషన్ కట్టమని, ఓపీఎస్‌ను త్వరగా అమలు చేయాలని ఈ ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు హరీష్ అన్నారు.

# ఉన్నావ్ అత్యాచార కేసులో సుప్రీం జోక్యం

**కుల్దీప్ సింగ్ సెంగార్‌కు బెయిల్ రద్దు చేస్తూ ఉత్తర్వులు**

**న్యూఢిల్లీ,డిసెంబర్29(జై భీమ్ న్యూస్):**

ఉన్నావ్ అత్యాచార కేసులో సుప్రీమ్ ధర్మాసనం కీలక నిర్ణయం తీసుకుంది. 2017లో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ అత్యాచార కేసులో.. బీజేపీ బహిష్కృత నేత కుల్దీప్ సింగ్ సెంగార్‌కు ఢిల్లీ హైకోర్టు ఇటీవల బెయిల్ మంజూరు చేసింది. దీన్ని సవాల్ చేస్తూ ఇద్దరు న్యాయవాదులు సుప్రీం కోర్టులో దాఖలు చేశారు. మరోవైపు ఇదే విషయమై.. సీబీఐ కూడా సర్వోన్న న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తూ స్పెషల్ లీవ్ పిటిషన్ల వేసింది. కుల్దీప్ బయటకు వస్తే కేసుపై ప్రభావం పడే అవకాశముందని సీబీఐ పేర్కొంది.ఈ వ్యాజ్యంపై సీజేఐ సూర్యకాంత్, న్యాయమూర్తులు జేకే.మహేశ్వరి, జస్టిస్ అగస్టీన్‌లతో కూడిన త్రిసభ్య ధర్మాసనం.. సోమవారం విచారణ చేపట్టింది. బాధితురాలి భద్రతకు సంబంధించిన అంశాలతో సీబీఐ ప్రస్తావించిన అంశాలను ధర్మాసనం పరిశీలించింది. ఈ మేరకు ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పు ఉత్తర్వులను నిలిపివేయడంతో పాటు నిందితుడు కుల్దీప్ సెంగార్‌కు నోటీసులు జారీ చేసింది. బెయిల్ రద్దు పిటిషన్‌పై నాలుగు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని సెంగార్‌ను ఆదేశించింది. ఉత్తర్ ప్రదేశ్‌లోని ఉన్నావ్ జిల్లాలో 2017లో 17ఏళ్ల ఓ బాలికపై సామూహిక అత్యాచారం జరిగింది. మాజీ ఎమ్మెల్యే, నాటి బీజేపీ నేత కుల్దీప్ సెంగార్ ఈ కేసులో ప్రధాన నిందితుడిగా తేలాడు. అయితే.. ఈ కేసు విచారణలో నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. 2018లో ఈ కేసును సీబీఐ విచారణ చేపట్టింది. ఆ తర్వాత యూపీ ట్రయల్ కోర్టు, ఢిల్లీ కోర్టులకు మారింది. 2019 డిసెంబర్‌లో కుల్దీప్ దోషిగా తేలడంతో అతనిపై జీవితఖైదు విధించింది న్యాయస్థానం. అయితే.. తాజాగా ఈ కేసులో అనూహ్య పరిణామం చోటు చేసుకుంది. సెంగార్‌కు పోక్సో చట్టం వర్తించదని.. ఢిల్లీ హైకోర్టు ఇటీవల షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది.

# సర్పంచ్, ఉప సర్పంచ్‌కు కఠిన హెచ్చరిక

**ఇలా చేస్తే పదవి ఊడటమే కాదు.. జైలు శిక్ష తప్పదు!**

**హైద్రాబాద్, 29 డిసెంబర్ 2025 (జై భీమ్ న్యూస్)**

గ్రామ పంచాయతీల్లో నిధుల నిర్వహణ, అభివృద్ధి పనుల అమలులో సర్పంచ్ మరియు ఉప సర్పంచ్‌ల పాత్ర అత్యంత కీలకమని అధికారులు స్పష్టం చేస్తున్నారు. గ్రామ పంచాయతీ నిధుల వినియోగంలో సర్పంచ్%-%ఉప సర్పంచ్‌ల ఉమ్మడి చెక్ పవర్ ఒక రక్షణ కవచంలా ఉంటుందని, అభివృద్ధి పనుల కోసం ఖర్చయ్యే ప్రతి పైసాకు ఇద్దరి సంతకం తప్పనిసరి అని అధికారులు గుర్తుచేస్తున్నారు. అయితే ఈ అధికారాల వినియోగంలో రాజకీయ విభేదాలు తలెత్తి సంతకాలు ఆలస్యం చేయడం లేదా కావాలనే అడ్డుకోవడం వల్ల గ్రామాభివృద్ధి తీవ్రంగా దెబ్బతింటోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిధుల విషయంలో అప్రమత్తంగా వ్యవహరించకపోతే ప్రజా ప్రతినిధులు తమ పదవులు కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. నిధుల ఖర్చుకు సంబంధించిన ప్రతి నిర్ణయం తప్పనిసరిగా గ్రామసభ తీర్మానం ఆధారంగానే జరగాలని అధికారులు స్పష్టం చేశారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో నగదు లావాదేవీలకు బదులుగా ఆన్‌లైన్ పేమెంట్లకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచిస్తున్నారు. ఖర్చు చేసిన వివరాలను ఎప్పటికప్పుడు పంచాయతీ రికార్డులు, బిల్లులు, వర్క్ రిజిస్టర్లలో నమోదు చేయడం ద్వారా ఆడిట్ తనిఖీల సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తవని పేర్కొన్నారు. పారదర్శకంగా వ్యవహరిస్తే సర్పంచ్, ఉప సర్పంచ్‌లు తమపై వచ్చే ఆరోపణల నుంచి చట్టపరమైన రక్షణ పొందగలరని తెలిపారు. ప్రజాధనాన్ని వ్యక్తిగత అవసరాలకు వినియోగించడం, పనులు పూర్తికాకుండానే బిల్లులు డ్రా చేయడం, తప్పుడు లెక్కలు చూపించడం, సంతకాలను ఫోర్జరీ చేయడం వంటి చర్యలు తీవ్రమైన నేరాలుగా పరిగణిస్తామని అధికారులు హెచ్చరించారు. ఇలాంటి అక్రమాలు వెలుగులోకి వస్తే సంబంధిత ప్రజా ప్రతినిధులపై క్రిమినల్ కేసులు నమోదు చేయడమే కాకుండా, జిల్లా కలెక్టర్‌కు వారిని పదవి నుంచి తొలగించే అధికారం ఉందని స్పష్టం చేశారు. అవసరమైతే జైలు శిక్ష పడేలా కూడా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇదిలా ఉండగా, అనేక గ్రామాల్లో సర్పంచ్ - ఉప సర్పంచ్‌ల మధ్య సాగుతున్న ఆధిపత్య పోరు గ్రామాభివృద్ధికి శాపంగా మారుతోందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాజకీయ కారణాలతో కావాలనే బిల్లులపై సంతకాలు పెట్టకుండా అభివృద్ధి పనులను అడ్డుకుంటే ప్రభుత్వం కఠినంగా స్పందిస్తుందని హెచ్చరించారు. విచారణలో అభివృద్ధిని అడ్డుకున్నట్లు తేలితే, సంబంధిత ఉప సర్పంచ్ యొక్క చెక్ పవర్‌ను రద్దు చేసే అధికారం కూడా కలెక్టర్‌కు ఉందని అధికారులు స్పష్టం చేశారు. మొత్తంగా గ్రామాభివృద్ధే లక్ష్యంగా సర్పంచ్, ఉప సర్పంచ్‌లు పరస్పర సమన్వయంతో, నిబంధనలకు లోబడి, పారదర్శకంగా పనిచేయాల్సిన అవసరం ఉందని అధికారులు సూచిస్తున్నారు. ప్రజాధనాన్ని బాధ్యతతో వినియోగించినప్పుడే పదవులు సురక్షితంగా ఉంటాయని, లేదంటే కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరిక జారీ చేశారు.

# తిరుమలలో వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు

**ఉత్తర ద్వార దర్శనానికి భారీగా ఏర్పాట్లు**
**క్యూలైన్లలో భక్తులకు అన్నప్రసాదాలు**
**టోకెన్లు ఉన్నవారికే దర్శన భాగ్యం**

**తిరుమల,డిసెంబర్29(జై భీమ్ న్యూస్):**

శ్రీవారి ఆలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనానికి భారీగా ఏర్పాట్లు చేశారు. డిసెంబర్ 30 నుండి జనవరి 8వ తేది వరకు నిర్వహించనున్న ప్రతిష్టాత్మక వైకుంఠ ద్వార దర్శనాలకు విచ్చేసే భక్తులకు స్వామివారి దర్శనాన్ని దివ్య అనుభూతిగా మార్చేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని టీటీడీ అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి అన్నారు. ఈసారి వైకుంఠ ద్వార దర్శనాలకు టోకెన్ల కేటాయింపులో విధానాత్మక మార్పులు తీసుకొచ్చినట్లు చెప్పారు. వైకుంఠ ద్వార దర్శన విధులకు వచ్చిన సిబ్బంది వ్యవస్థను పూర్తిగా అర్థం చేసుకుని సమన్వయంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా 24 గంటలు అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలని అధికారులతో అన్నారు. భక్తుల భద్రత, రద్దీ నిర్వహణకు ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా అత్యాధునిక ఏఐ సాంకేతికత వినియోగిస్తున్నట్లు చెప్పారు. ఈ సాంకేతికత ద్వార భక్తులు, వాహనాల రద్దీపై ప్రత్యక్ష పర్యవేక్షణ కొనసాగుతుందని పేర్కొన్నారు. టీటీడీ, పోలీస్, విజిలెన్స్ విభాగాల నుండి ఐటీ నిపుణులు సమన్వయంతో పని చేస్తూ ఎప్పటికప్పుడు భక్తుల సమాచారాన్ని అప్డేట్ చేస్తూ వైకుంఠం క్యూ కాంప్లెక్స్-1 లోని ఇంటిగ్రేటెడ్ ఏఐ కమాండ్ కంట్రోల సెంటర్ లో ప్రదర్శించాలని చెప్పారు. భవిష్యత్తులో తిరుమలకు వచ్చే భక్తుల కోసం సమస్య రహిత వ్యవస్థను నిర్మించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని తెలియజేశారు. వైకుంఠ ద్వార దర్శనాలకు విచ్చేసే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని విస్తృత ఏర్పాట్లు చేసినట్లు టీటీడీ అదనపు ఈవో శ్రీ సి.హెచ్.వెంకయ్య చౌదరి తెలిపారు. క్యూలైన్లలో ఏర్పాటు చేసిన తాగునీటి కొళాయిలు, అన్న ప్రసాదం పంపిణీ, మరుగుదొడ్ల సౌకర్యాలను పరిశీలించి భక్తులతో మాట్లాడి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. వైకుంఠ ద్వార దర్శనాలు పురస్కరించుకుని చాలా వరకు ఏర్పాట్లను ఇప్పటికే పూర్తి చేశామని చెప్పారు. భక్తుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని క్యూలైన్లలో పలు మార్పులు చేపట్టామని తెలిపారు. క్యూలైన్లలో భక్తులు కూర్చునేవిధంగా ఏర్పాట్లు చేయడంతో పాటు, తాగునీటి సౌకర్యం, క్యూలైన్లకు అనుసంధానంగా అదనపు మరుగుదొడ్లు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు చెప్పారు. చలికాలం కావడంతో క్యూలైన్లలోని అన్న ప్రసాదాల పంపిణీ కేంద్రాల్లో అన్న ప్రసాదాలు చల్లబడకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకునే ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. అదేవిధంగా భక్తులకు తాగునీరు అందించేందుకు అదనంగా మొబైల్ వాటర్ డ్రమ్స్, మూడు మొబైల్ ఫుడ్ వ్యాన్లు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. భక్తుల కోసం టీటీడీ అందుబాటులో ఉంచిన సదుపాయాలను వినియోగించు కునేందుకు వివిధ భాషల్లో సూచిక బోర్డులను కూడా క్యూలైన్లలో మరియు ముఖ్యమైన ప్రాంతాల్లో ఏర్పాటు చేశామన్నారు. భక్తులందరూ టీటీడీ క్యూలైన్లలో కల్పిస్తున్న సౌకర్యాలను వినియోగించుకుని సంయమనంతో స్వామివారిని దర్శించుకోవాలని తెలియజేశారు.తిరుమల శ్రీవారి ఆలయంలో వైకుంఠ ద్వార దర్శనాలను పురస్కరించుకుని విచ్చేసే భక్తుల రద్దీ దృష్ట్యా డిసెంబర్ 28 నుండి జనవరి 7వ తేది వరకు తిరుపతిలోని భూదేవి కాంప్లెక్స్ లో భక్తులకు ఇచ్చే ÷ూఆ టోకెన్ల జారీని రద్దు చేయడం జరిగింది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని సహకరించవలసిందిగా భక్తులకు టీటీడీ విజ్ఞప్తి చేయడమైనది. తిరుమల శ్రీవారి ఆలయంలో వైకుంఠ ద్వార దర్శనాలు. తొలి మూడు రోజులు అనగా, డిసెంబర్ 30, 31 మరియు జనవరి 01వ తేదీల్లో ఈ-డిప్ ద్వారా టోకెన్లు పొందిన భక్తులకు మాత్రమే వైకుంఠ ద్వార దర్శనం. టోకెన్ పొందిన భక్తులు తమకు కేటాయించిన తేదీలలో నిర్దేశిరచిన సమయానికి మాత్రమే తిరుమలలోని దర్శన ప్రవేశ మార్గాలకు చేరుకోవాల్సి ఉంటుంది. వైకుంఠ ఏకాదశి నుంచి పదిరోజుల పాటు తిరుమలలో భక్తులకు ఏ ఇబ్బందులూ రాకుండా పక్కాగా ఏర్పాట్లు చేసినట్లు తితిదే అదనపు ఈఓ వెంకయ్య చౌదరి వెల్లడించారు. తొలిరోజు ప్రొటోకాల్ దర్శనాలు ముగిసిన వెంటనే స్లాటెడ్ సర్వదర్శనం మొదలవుతుంది. సోమవారం అర్ధరాత్రి తర్వాత 1:30 నుంచి మంగళవారం రాత్రి 11:45 గంటల మధ్య.. 20 గంటల పాటు సామాన్యులకే అవకాశం కల్పిస్తాం. సుమారు 70వేల మందికి దర్శనం చేయించాలన్నది లక్ష్యం. ఏ రోజు టోకెన్ పొందితే, అదేరోజు దర్శనం చేయించేలా గంటలవారీగా లెక్కలు కట్టి అమలుచేస్తాం. ఇందుకోసం ఏఐ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను వినియోగించనున్నాం. భక్తులు టోకెన్‌పై నిర్దేశిరచిన సమయానికి, సూచించిన ప్రదేశానికి రావాలి. వేచి ఉండే భక్తులకు పులిహోర, చక్కెర పొంగలి, దద్దోజనం తదితర 16 రకాల ఆహార పదార్థాలు సిద్ధం చేస్తున్నాం. మొదటి మూడు రోజులు 24 గంటలూ అన్నప్రసాదాలు, వేడి పానీయాలు కాఫీ, టీ, బాదం పాలు, చిన్నపిల్లలకు పాలు సిద్ధంగా ఉంటాయి. నిత్యం 4.30 లక్షల లడ్డూలు అందుబాటులో ఉంచుతున్నాం. లడ్డూ కౌంటర్ల వద్ద రద్దీ తగ్గించేందుకు డిజిటల్ పేమెంట్ కియోస్క్‌లు ఏర్పాటుచేశాం. నగదురహితంగా స్లిప్పులు పొంది నేరుగా లడ్డూలు తీసుకోవచ్చు. పూర్తిగా ఆటోమేటెడ్ సిస్టమ్‌లో గదులు కేటాయిస్తున్నాం. కొత్తగా అందుబాటులోకి వచ్చిన వెంకటాద్రి నిలయం (పీఏస్సీ -5)లో అద్భుత వసతులున్నాయి. భక్తులు గదుల కోసం వేచిచూడకుండా, ఇక్కడ స్నానాదులు ముగించుకుని తమ స్లాట్ ప్రకారం దర్శనానికి వెళ్తే మంచిదని సూచించారు.

# తనుగుల చెక్ డ్యామ్ పేల్చేశారు

**అసెంబ్లీలో కౌశిక్ రెడ్డి వ్యాఖ్యలపై దుమారం**

**హైదరాబాద్,డిసెంబర్ 29(ఆర్ఎన్ఎ):**

హుజూరాబాద్‌లో పెద్ద ఆయకట్టు కొట్టుకుపోయిందని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తెలిపారు. రిపేర్ చేస్తే దాదాపు ఏడు వేల ఎకరాలకు నీళ్లు అందుతాయని పేర్కొన్నారు. వెంటనే ఆ ప్రాజెక్టులను పూర్తి చేయాలని కోరారు.అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా నిర్వహించిన ప్రశ్నోత్తరాల సందర్భంగా పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ.. తన నియోజకవర్గంలోని తనుగుల చెక్‌డ్యామ్‌ను బాంబు పెట్టి పేల్చివేశారని తెలిపారు. మేడిగడ్డ మాదిరిగానే చెక్‌డ్యామ్‌ను బాంబు పెట్టి పేల్చేశారని పేర్కొన్నారు. కౌశిక్ రెడ్డి మాట్లాడుతుంటే ఆయన ప్రసంగానికి కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అడ్డుపడ్డారు. దీంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి మాట్లాడేందుకు స్పీకర్ గడ్డం ప్రసాద్ అవకాశం కల్పించారు. తెలంగాణ అసెంబ్లీ శీతాకాల సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు అసెంబ్లీలో తీవ్ర దుమారం రేపాయి. మేడిగడ్డ ప్రాజెక్ట్ మాదిరిగానే తనుగుల చెక్ డ్యాంను బాంబులు పెట్టి పేల్చేశారంటూ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఆరోపించారు. ఈ విమర్శతో అసెంబ్లీలో అలజడి రేగింది. కౌశిక్ రెడ్డి వ్యాఖ్యలపై కాంగ్రెస్ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. బాంబులు పెట్టి పేల్చారని ఆరోపణలు చేయడం ఏమిటంటూ కౌశిక్ రెడ్డిపై కాంగ్రెస్ సభ్యులు ఎదురుదాడికి దిగారు. రికార్డుల నుంచి ఆ పదాలు తొలగించాలంటూ స్పీకర్‌ను కాంగ్రెస్ సభ్యుడు నాగరాజు కోరారు. అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారు. 2023 ఏడాది చివర్లో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. దీనికి కొన్ని నెలల ముందు లక్షల కోట్ల రూపాయిలు ప్రజాధనం వెచ్చించి నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ రిజర్వాయర్‌లోని పలు పిల్లర్లు కుంగాయి. ఈ అంశం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. రూ.లక్షల కోట్లు వెచ్చించి నిర్మించిన ప్రాజెక్ట్ నిర్మాణంలో లోపానికి కారణం నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం మంటూ ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ విమర్శలు గుప్పించింది. అంతేకాకుండా తాము అధికారంలోకి వస్తే.. దీనిపై న్యాయ విచారణ చేపడతామంటూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చింది. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ ఓటరు పట్టం కట్టాడు. రేవంత్ రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువు తీరింది. ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ పీసీ ఘోష్ ఆధ్వర్యంలో కమిషన్ ఏర్పాటు చేసింది. దాదాపు రెండేళ్ల పాటు విచారించిన ఈ కమిషన్.. తన నివేదికను ప్రభుత్వానికి అందజేసింది. అయితే మేడిగడ్డ పిల్లర్లు కృంగడానికి బాంబుతో పేల్చడమే కారణమంటూ బీఆర్ఎస్ పార్టీ ఆరోపించింది. ఈ ఆరోపణలను కాంగ్రెస్ పార్టీ ఖండించింది.

# అమెరికాలో రోడ్డు ప్రమాదం

**గార్లకు చెందిన ఇద్దరు యువతుల దుర్మరణం**

**మహబూబాబాద్,డిసెంబర్29(జై భీమ్ న్యూస్) :**

అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదం రెండు కుటుంబాల్లో విషాదం నింపింది. ఘాట్‌రోడ్డులో జరిగిన కారు ప్రమాదంలోఇద్దరు యువతులు దుర్మరణం చెందారు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. తెలంగాణలోని మహబూబాబాద్ జిల్లా గార్లకు చెందిన పులఖండం మేఘనారాణి (25), ముల్కనూరుకు చెందిన కడియాల భావన (24) మూడేళ్ల క్రితం అమెరికా వెళ్లారు. అక్కడ ఎమ్మెస్ పూర్తిచేసి ప్రస్తుతం ఉద్యోగాన్వేషణలో ఉన్నారు. మేఘన, భావన సహా మొత్తం 8 మంది స్నేహితులు రెండు కార్లలో కాలిఫోర్నియాలో టూర్‌కి బయల్దేరారు. ఈ క్రమంలో అలబామా హిల్స్ రోడ్డులో మలుపు వద్ద మేఘన, భావన ప్రయాణిస్తున్న కారు లోయలో పడింది. దీంతో వారిద్దరూ మృతిచెందారు. అమెరికా కాలమానం ప్రకారం ఆదివారం సాయంత్రం 4 గంటలకు ఈ ప్రమాదం చోటుచేసుకుంది. యువతుల మృతితో వారి కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది.

# విశాఖ నగరపాలక సంస్థలో పది జోన్లు

**జనవరి 1 నుంచి కార్యకలాపాలు ప్రారంభించాలి**
**జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశం**

**విశాఖపట్టణం,డిసెంబర్ 29(జై భీమ్ న్యూస్):**

మహా విశాఖ నగరపాలక సంస్థ పరిధిలో పునర్వ్యవస్థీకరించిన 10 జోనల్ కార్యాలయాల్లో జనవరి 1 నుంచి కార్యకలాపాలు ప్రారంభించాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. మార్పులకు అనుగుణంగా జోనల్ కార్యాలయాలు, అధికారులు, సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు.జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఈ మేరకు జోనల్ కమిషనర్లకు ఆదేశాలు జారీ చేశారు. జీవీఎంసీ పరిధిలో జోనల్ పునర్వ్యవస్థీకరణకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలుపుతూ ఉత్తర్వులు జారీ చేసిందని.. అందుకు అనుగుణంగా ప్రస్తుతం ఉన్న 8 జోన్లను 10కి పెంచినట్లు కమిషనర్ పేర్కొన్నారు. జనవరి 1వ తేదీ నుంచి 10 జోనల్ కార్యాలయాలు పనిచేయాలని, అందుకు సంబంధించిన ÷ల్స్, రికార్డులు తారుమారు కాకుండా ఒక క్రమ పద్ధతిలో ఆయా జోన్లకు తీసుకువెళ్లాలన్నారు. ఇకపై సిబ్బంది, అధికారులు ఆయా జోనల్ కార్యాలయాల నుంచే విధులు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని కమిషనర్లను ఆదేశించారు. ఆయా జోనల్ కార్యాలయాల పరిధిలో ఉన్న వార్డులు, సచివాలయాలు ప్రజలకు తెలిసే విధంగా సచివాలయాల వారీగా వార్డు కార్యదర్శులు అవగాహన కల్పించాలని జోనల్ కమిషనర్లు, అధికారులను కమిషనర్ ఆదేశించారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి ఇకపై జీవీఎంసీ కల్పిస్తున్న సంక్షేమ పథకాలు మౌలిక సదుపాయాలు,సేవలు ఆయా జోనల్ కార్యాలయాల ద్వారా పొందాలని కమిషనర్ తెలిపారు.

# ప్రజాభీష్టం మేరకే జిల్లాల్లో మార్పులు,చేర్పులు

**17 జిల్లాల్లో కొన్ని మార్పులు చేసినట్లు వెల్లడి**
**సాంఘిక సంక్షేమ శాఖలో రుణ గ్రహీతలకు ఉపశమనం**
**ప్రభుత్వ కార్యాలయాల్లో స్మార్ట్ మీటర్ల ఏర్పాటు**
**రాజముద్రతో 21.8 లక్షల పాస్‌బుక్‌లు పంపిణీ**
**కేబినెట్ నిర్ణయాలను వెల్లడించిన మంత్రులు**



**అమరావతి,డిసెంబర్ 29(జై భీమ్ న్యూస్):**

ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు జిల్లాల ఏర్పాటులో మార్పులు, చేర్పులు చేసినట్లు మంత్రులు తెలిపారు.క్యాబినెట్‌లో 24 అంశాలను చర్చించి ఆమోదం తెలిపినట్లు ఆంధ్రప్రదేశ్ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయాలను మంత్రులు నాదెండ్ల మనోహర్, సత్యకుమార్‌తో కలిసి అనగాని వెల్లడించారు. సాంఘిక సంక్షేమ శాఖలో రుణాలు తీసుకున్న వారికి ఉపశమనం కల్పించామన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఆమోదించామన్నారు. 9 జిల్లాల్లో మాత్రం ఎలాంటి మార్పులు చేయలేదని.. 17 జిల్లాల్లో కొన్ని మార్పులు చేసినట్లు వెల్లడించారు. ప్రజల కోరిక మేరకు డివిజన్లు, మండలాలు మార్చామన్నారు. గత ప్రభుత్వం సరిగా ఆలోచించకుండా జిల్లాల విభజన చేసిందని విమర్శించారు. గతంలో పారదర్శకంగా చేసుంటే ఈ సమస్యలు వచ్చేవి కావని మంత్రులు నాదెండ్ల, సత్యకుమార్ వ్యాఖ్యానించారు. గ్రేటర్ విజయవాడ, గ్రేటర్ తిరుపతి ప్రతిపాదనలు ఉన్నాయి. గ్రేటర్ సిటీలుగా అభివృద్ధి చేస్తామని సీఎం అన్నారు. రాజముద్రతో 21.8 లక్షల పాస్‌బుక్‌లు పంపిణీ చేస్తున్నాం. జనవరి 9లోగా పాస్‌బుక్‌ల పంపిణీ పూర్తి చేస్తాం. తప్పులు సరిచేశాకే పాస్‌బుక్‌లు ఇవ్వాలని ఆదేశించాం. పాస్‌బుక్‌లపై గత పాలకుల ఫోటోలు తొలగించాం. పోలవరం పరిసర ప్రాంతాలను అభివృద్ధి చేస్తామని సీఎం చంద్రబాబు చెప్పారు. రాయచోటిని మరింత అభివృద్ధి చేసేందుకు సీఎం హామీ ఇచ్చారు. మంత్రి మండిపల్లిని పిలిచి సీఎం చంద్రబాబు ఓదార్చారు. పరిపాలనా సౌలభ్యం కోసం నిర్ణయాలు తీసుకున్నాం అని మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. అన్నమయ్య జిల్లా కేంద్రంగా రాయచోటి మార్పుపై మంత్రి రాంప్రసాద్ రెడ్డి తీవ్ర భావోద్వేగానికి గురవడం చర్చనీయాంశంగా మారింది. వెంటనే రంగంలోకి దిగిన సీఎం చంద్రబాబు మంత్రితో మాట్లాడారు. అలాగే రాయచోటి నియోజకవర్గాన్ని జిల్లా స్థాయి అభివృద్ధికి కేంద్రంగా తీర్చిదిద్దుతామని హామీ ఇవ్వడం జరిగింది. రాయచోటి మార్పు వ్యవహారంపై మంత్రి రాంప్రసాద్ రెడ్డి చాలా బాధపడుతున్నారని తెలిపారు. అందుకే ముఖ్యమంత్రి స్వయంగా రంగంలోకి దిగి మంత్రిమండలి తరవాత కూడా రాంప్రసాద్ రెడ్డిని పిలిచారన్నారు. ఆయన్ను ఓదార్చినట్లు తెలిపారు.

రాయచోటిని అన్నివిధాలా అభివృద్ధి చేస్తామని సీఎం చెప్పారని అన్నారు. ఆయనకు మెడికల్ కాలేజీ కావాలా?.. ఇంకేం ఏమన్నా కావాలా అన్న విషయాన్ని ప్రభుత్వం చూస్తుందని తెలిపారు. అలాగే రాంప్రసాద్ రెడ్డి రాజీనామా లాంటి హెస్టీ డెసిషన్‌లాంటివి తీసుకోరన్నారు. ఆయనకు కూడా తమ ప్రాంత అభివృద్ధి ముఖ్యం అని భావిస్తారని మంత్రి స్పష్టం చేశారు. అన్నమయ్య ఎక్కడ జన్మించినా శ్రీవారి సేవలో ఉన్నారని తెలిపారు. అన్నమయ్యకు ప్రాంతాలు ఉండవని... గతంలో కూడా కృష్ణా జిల్లాలో ఎన్టీఆర్ జన్మిస్తే ఎన్టీఆర్ జిల్లా ఏర్పాటు చేసి పెట్టారని మంత్రి అనగాని గుర్తుచేశారు. పరిపాలనా సౌలభ్యం కోసమే రాయచోటి నుంచి మదనపల్లికి మార్చారని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. కూటమి కేంద్రం సహకారంతో ప్రభుత్వంలో చేస్తున్న అనేక కార్యక్రమాలను కేబినెట్ చివరన సీఎం తెలిపారన్నారు. అభివృద్ధి, సంక్షమం కింద రాష్ట్ర ప్రజలకు అండగా నిలిచామని.. రూ.50 వేల కోట్లు పెన్షన్ల కింద పంపిణీ చేశామని అన్నారు. సూపర్ సిక్స్ చాలా బాగా సక్సెస్ చేయగలిగామని.... ఆర్థిక ఇబ్బందులున్నా దీన్ని అధిగమించగలిగామని తెలిపారు. ప్రతి గ్రామంలో పల్లె పండుగ తెచ్చి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పంచాయితీ రాజ్ వ్యవస్థను బలోపేతం చేశారన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద పెట్టుబడి గూగుల్ విశాఖకు రావడం ఏపీకి గర్వకారణమన్నారు. గంజాయిపై తాము చేసిన యుద్ధం గురించి కూడా సీఎం కేబినెట్‌లో ప్రస్తావించారని తెలిపారు. రాయలసీమలో తిరుపతిని ఇండస్ట్రియల్ హబ్‌గా, నెల్లూరు పోర్టును ఉపయోగించుకొని 2026లో ముందుకు వెళితే స్వర్ణాంధ్రప్రదేశ్ దిశగా ముందుకు వెళాతామన్నారు. పట్టుదలతో , అంకిత భావంతో బాధ్యతగా పనిచేద్దామని ముఖ్యమంత్రి చెప్పారని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.ఈ ఏడాదిలో ప్రభుత్వపరంగా చాలా కార్యక్రమాలను అమలు చేశాం. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సహకారంతో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కలిసి దిగ్విజయంగా చేసిన పనులు గురించి చర్చించాం. గతంలో ఎన్నడూ లేని విధంగా రూ. 50 వేల కోట్ల వరకూ ఎన్టీఆర్ భరోసా పేరిట పింఛన్లు అందించాం. సచివాలయాల విషయంలోనూ చాలా మార్పులు చేశాం. ఇప్పటి వరకు రూ. 1200 కోట్లు వెచ్చించి రోడ్లను వేశాం. రూ. 2,500 కోట్లు మంజూరు చేసి రోడ్లను మరమ్మతు చేయిస్తున్నాం. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రతి గ్రామంలో పల్లె పండుగ కార్యక్రమం తీసుకొచ్చారు. విశాఖలో పెద్ద ఎత్తున పెట్టుబడులను సీఎం చంద్రబాబు నాయకత్వంలో తీసుకొచ్చాం. ఐటీ సేవలను మరింత విస్తృతం చేసి అభివృద్ధి చేసేందుకు ప్రయత్నాలను ముమ్మరం చేశాం. పోలీసు శాఖను బలోపేతం చేశాం. గ్రామ, వార్డు సచివాలయాలను స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డుగా మారుస్తున్నాం' అని మనోహర్ తెలిపారు. ఆర్థిక సమస్యలు ఉన్నా ఇచ్చిన మాట ప్రకారం ముందుకెళ్తున్నాం. గతంలో జరిగిన విధ్వంసకర చర్యలను సరి చేస్తున్నాం. మహిళలకు ఆర్థిక స్వేచ్ఛ కల్పించే దిశగా అనేక కార్యక్రమాలు చేపట్టాం. మౌలిక వసతుల కోసం దాదాపు రూ. 3 లక్షల కోట్లను ఖర్చు చేస్తున్నాం. కొప్పర్తి, ఓర్వకల్లుకు పెట్టుబడులు భారీగా వస్తున్నాయి. మచిలీపట్నం నుంచి హైదరాబాద్ ఫ్యూచర్ సిటీ వరకు రోడ్డు వెళ్తుంది. కేంద్రం నుంచి సంపూర్ణ సహకారం అందుతోంది. గత ప్రభుత్వం మాదిరిగా పథకాలకు తమ పేర్లను కాకుండా.. మహనీయుల పేర్లను పెడుతున్నాం. దీనిపైనా మంత్రివర్గం లో చర్చ జరిగిందని మంత్రి సత్యకుమార్ తెలిపారు. ప్రధానంగా విశాఖలో ఆసుపత్రి నిర్మాణానికి భూమి కేటాయింపు, పెనుగొండను వాసవీ పెనుగొండగా మార్చేందుకు ఆమోదం లభించింది. మార్కాపురం, గిద్దలూరు, కనిగిరి, యర్రగొండపాలెం కలిపి జిల్లా ఏర్పాటు చేయనున్నారు.బనగానపల్లె, అద్దరోడ్డును డివిజన్లగా ఏర్పాటు చేస్తారు. చేర్పులు, మార్పులన్నీ జనవరి 1 నుంచి అమల్లోకి వస్తాయి. అన్నమయ్య జిల్లా పేరు అలాగే ఉంటుంది.. జిల్లా కేంద్రం మాత్రం మదనపల్లెకు మారుతుంది. అద్దంకి నియోజకవర్గం బాపట్ల జిల్లా నుంచి ప్రకాశం జిల్లాకు మార్పు చేశారు. ప్రకాశం జిల్లాలో అద్దంకి సబ్‌డివిజన్‌లోనే దర్శి నియోజకవర్గం ఉంటుంది. రాజంపేటను కడప జిల్లాలో, రైల్వేకోడూరును తిరుపతి జిల్లాలోకి, కడపలోకి సిద్ధవటం, ఒంటిమిట్ట మార్పు చేయగా, ప్రత్యేక రెవెన్యూ డివిజన్‌గా మడకశిరను ఏర్పాటు చేయనున్నారు.

## డబ్బుల కోసమే జీహెచ్‌ఎంసీ డీలిమిటేషన్

**హైదరాబాద్,డిసెంబర్ 29(జై భీమ్ న్యూస్) :**

జీహెచ్‌ఎంసీని అడ్డగోలుగా విభజించారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. జీహెచ్‌ఎంసీ డీలిమిటేషన్ కేవలం డబ్బుల కోసం చేస్తున్నదనే అని అన్నారు. మర్చంట్ బ్యాంకర్ బ్రోకర్ చెప్పినట్లుగా రేవంత్ రెడ్డి చేస్తున్నారని మండిపడ్డారు. అసెంబ్లీలో మీడియాతో కేటీఆర్ చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. జీహెచ్‌ఎంసీని మూడు ముక్కలు చేస్తున్నారని మండిపడ్డారు. ఫోర్త్ సిటీ అని పెట్టాడని.. దాన్ని కూడా తొందరలో ఏదో కార్పొరేషన్ చేస్తాడు కావచ్చని ఎద్దేవా చేశారు. ఏం చేసినా శాస్త్రీయంగా ఉండాలని.. కానీ ఇష్టమొచ్చినట్లు చేస్తే ఊరుకోరని తెలిపారు. వీటన్నింటికీ సమాధానం చెప్పాల్సి ఉంటుందని హెచ్చరించారు. జీహెచ్‌ఎంసీ డివిజన్ల విభజనపై సభలో చర్చకు పెట్టాలని డిమాండ్ చేశారు. చర్చలో అన్ని విషయాలపైనా తాము మాట్లాడతామని స్పష్టం చేశారు. జీహెచ్‌ఎంసీలో కాంగ్రెస్, ఎంఐఎం ఏం చే?కుంటారో.. ఎవరికి లాభం చేకూర్చేలా చేసుకుంటారో వాళ్లిష్టమని అన్నారు. కానీ తమకు మాత్రం 2016లో జరిగిన జీహెచ్‌ఎంసీ ఎన్నిక చారిత్రాత్మక ఎన్నిక అని తెలిపారు. అలాంటి ఎన్నికలు ఇప్పటివరకు చూడలేదని.. మళ్లీ చూడబోమని చెప్పారు. గతంలో ఓల్డ్ సిటీలో కూడా బీఆర్‌ఎస్ రెండు సీట్లు గెలిచామని గుర్తుచేశారు. గతంలో మేం గెలిచిన సీట్లు ఇంకా ఎవరు గెలవలేరని వ్యాఖ్యానించారు. అసెంబ్లీలో కేసీఆర్‌కు సీఎం రేవంత్ రెడ్డి షేక్‌హ్యాండ్ ఇవ్వడంపైనా కేటీఆర్ స్పందించారు. కేసీఆర్ అంటే గౌరవం ఉంటే చాలని అన్నారు. తెలంగాణ తెచ్చిన నాయకుడివగా కేసీఆర్ పట్ల తెలంగాణలో ప్రతి ఒక్కరికీ గౌరవం ఉంటుందని తెలిపారు. ముఖ్యమంత్రికి సభలో కేసీఆర్‌ను కలిసేంత సంస్కారం ఉంటే చాలని.. ఇదే సంస్కారం బయట మాటల్లో కూడా ఉంటే బాగుండేదని వ్యాఖ్యానించారు. రాజకీయ ప్రత్యర్థులు ఒకరినొకరు పలకరించుకునేంత సానుకూల వాతావరణం ఉంటే మంచిదేనని అన్నారు.

## ఆరావళిపై ఇచ్చిన ఉత్తర్వులపై సుప్రీం స్టే

**కొత్తకమిటీతో ఆరావాళిపై అధ్యయనానికి ఆదేశం**

**న్యూఢిల్లీ,డిసెంబర్29(జై భీమ్ న్యూస్):**

ఆరావళి పర్వత శ్రేణుల్లో మైనింగ్ వివాదంపై సిజెఐ జస్టిస్ సూర్యకాంత నేతృత్వంలో సోమవారం విచారణ సందర్భంగా కీలక నిర్ణయం ప్రకటించింది. గతంలో ఇచ్చిన ఉత్తర్వులను వెనక్కు తీసుకుంది. ఇటీవల ఆరావళి కొండలకు ఆమోదించిన నిర్వచనాలకు సంబంధించిన కొన్ని వివరణలు అవసరమని సుప్రీం కోర్టు సోమవారం పేర్కొంది, అదే సమయంలో ఈ అంశంపై గత నెలలో జారీ చేసిన తీర్పుపై స్టే విధించింది. గతంలో అధికారులతో కూడిన కమిటీ చేసిన సిఫార్సుల పర్యావరణ ప్రభావాన్ని అధ్యయనం చేయడానికి నిపుణుల కమిటీ ఏర్పాటు చేస్తామని కోర్టు పేర్కొంది. ఆరావళి కొండల నిర్వచనంపై దాఖలైన సమస్యపై సుమోటో కేసులో కోర్టు ఈ ఉత్తర్వులు జారీ చేసింది. 100 మీటర్లలోపు ఎత్తు ఉన్న ఆరావళి పర్వతాల వద్ద మైనింగ్‌కు గతంలో అనుమతులు ఇచ్చింది సుప్రీంకోర్టు. తాజాగా గతంలో ఇచ్చిన ఆదేశాలపై స్టే విధిస్తూ నేడు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. పర్యావరణపరంగా పలు రాష్ట్రాలకు రక్షణ కవచంగా ఉన్న ఆరావళి పర్వతాలపై కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిర్వచనానికి సుప్రీంకోర్టు ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. అయితే ఈ కొత్త నిర్వచనం జాతీయస్థాయిలో దుమారం రేపుతోంది. ఈ క్రమంలో తాజాగా సుప్రీంకోర్టు స్పందించింది. గత నెల తాను ఇచ్చిన ఆదేశాలను సోమవారం నిలిపివేసింది. 'కోర్టు ఆదేశాలు, కమిటీ సిఫార్సులు నిలిపివేయడం అవసరమని మేం భావిస్తున్నాం. కొత్త కమిటీ ఏర్పాటయ్యేవరకు ఈ స్టే అమల్లో ఉంటుంది' అని ధర్మాసనం పేర్కొంది. కొత్త నిపుణుల బృందాన్ని ఏర్పాటుచేయాలని ఆదేశించడంతో పాటు కేంద్ర ప్రభుత్వం, సంబంధిత రాష్ట్రాలకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను జనవరి 21కి వాయిదా వేసింది.దేశంలోనే అతిపురాతన పర్వతశ్రేణి ఆరావళి. ఇక్కడ అక్రమంగా పొందిన అనుమతులతో అడ్డగోలుగా మైనింగ్ జరుగుతోందని ఎప్పటినుంచో ఆందోళన ఉంది. ఇలాంటి సమయంలో 100 మీటర్లు... అంటే 328 అడుగుల కంటే ఎక్కువ ఎత్తున్నవి మాత్రమే పర్వతాలంటూ కేంద్రం కొత్త నిర్వచనం చెప్పింది. 100 మీటర్ల కంటే తక్కువ ఎత్తులో ఉన్న కొండల్లో మైనింగ్‌కు అనుమతించింది. దీనివల్ల హరియాణా, రాజస్థాన్, గుజరాత్, దిల్లీకి ముప్పు తప్పదని పర్యావరణవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆరావళి పర్వత శ్రేణులు ఉన్న రాష్ట్రాలు కొత్తగా మైనింగ్ లీజులేవీ ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం ఇటీవల నిషేధం విధించింది. గుజరాత్ నుంచి జాతీయ రాజధాని ప్రాంతం (ఎన్‌సీఆర్) వరకూ విస్తరించి ఉన్న ఆరావళి పర్వత శ్రేణుల సమగ్రతను పరిరక్షించేందుకు, గనుల అక్రమ తవ్వకాలను అడ్డుకునేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్న సంగతి తెలిసిందే. విచారణ సందర్భంగా తాత్కాలిక దరఖాస్తుదారుల ప్రవర్తనపై సీజెఐ తీవ్ర అసంతృప్తి చెందారు. ఆరావళి పర్యతాలపై క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని, పర్యావరణ ముప్పునకు పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని కమిటీకి సూచించింది. ఈ కేసును జనవరి 21న వివరణాత్మకంగా విచారణ చేపట్టాలని కోర్టు ఆదేశించింది. కేంద్ర ప్రభుత్వం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు.

## యువ ఫిల్మ్ మేకర్ల చేతుల్లో సంక్షేమ పథకాలు

**ప్రతి గడపకు చేరేలా బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్'**
**అవార్డుల ప్రదానోత్సవంలో మంత్రి కోమటిరెడ్డి**

**హైదరాబాద్,డిసెంబర్ 29(జై భీమ్ న్యూస్) :**

ఇవాళ తెలంగాణ గర్వించదగ్గ రోజు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని 'ప్రజా ప్రభుత్వం' దేశంలోనే ఎక్కడా లేని విధంగా ఒక అద్భుతమైన ప్రయోగానికి శ్రీకారం చుట్టిందని సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి గడపకూ ఎలా చేరుతున్నాయో ప్రపంచానికి చాటిచెప్పే బాధ్యతను మన యువ ఫిల్మ్ మేకర్ల చేతుల్లో పెట్టాం అన్నారు.తెలంగాణ ఫిల్మ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ నిర్వహించిన ఈ 'బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్' కేవలం ఒక పోటీ మాత్రమే కాదు.. ఇది మన యువత మేధస్సుకు, సృజనాత్మకతకు ఒక గొప్ప వేదికన్నారు. రాష్ట్రం నలుమూలల నుండి, ముఖ్యంగా మారుమూల గ్రామాల నుండి వచ్చిన ఎంట్రీలను చూస్తుంటే నాకు చాలా సంతోషంగా ఉందన్నారు. తెలంగాణ ఫిల్మ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్' అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం సోమవారం రవీంద్ర భారతిలో అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి... రాష్ట్ర టూరిజం, కల్చరర్,ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తో కలిసి ముఖ్య అతిథిగా హాజరై విజేతలను ప్రకటించి,అవార్డులు ప్రదానం చేశారు. మొదటి బహుమతి 3లక్షలు,రెండో బహుమతి 2లక్షలు,మూడో బహుమతి 1లక్ష.. షార్ట్ ఫిల్మ్,బతుకమ్మ వీడియో విభాగాలకు వేరు వేరుగా నగదు బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా కోమటిరెడ్డి మాట్లాడుతూ మీరంతా ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య ఒక చైతన్యవంతమైన వారధిలా నిలిచారు. పల్లెల్లో ఉన్న అపారమైన ప్రతిభను ఈ వేదిక ద్వారా ప్రపంచానికి పరిచయం చేయడం సినిమాటోగ్రఫీ మంత్రిగా నాకు ఎంతో గర్వకారణం. ఈ పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్క యంగ్ ఫిల్మ్ మేకర్ కు నా హృదయపూర్వక అభినందనలు తెలుపుతున్నాను. గెలుపొందిన విజేతలకు నా ప్రత్యేక శుభాకాంక్షలు. మీ ప్రయాణం ఇక్కడితో ఆగిపోకూడదు.. తెలంగాణ భవిష్యత్తును మీ కళాత్మక దృష్టితో మరింత గొప్పగా తీర్చిదిద్దాలని కోరుకుంటున్నానని మంత్రి పేర్కొన్నారు. తాను గతంలో దిల్ రాజు నిర్మించిన బలగం సినిమా చూసాను.. ఇటీవల వచ్చిన 'దండోరా' సినిమా చూసాను..సమాజానికి మంచి మెసేజ్ ఇచ్చేలా,హృదయానికి దగ్గరయ్యే విధంగా ఉన్నాయి అని అన్నారు. అదేవిధంగా తెలంగాణలో సినిమాలు తీసుకోవడానికి లోకేషన్స్ పరంగా కూడా టూరిజం డెవలప్మెంట్ చేస్తున్నామని, దక్షిణకాశీగా పేరుగాంచిన శ్రీశైలం మల్లన్న దర్శనానికి ఘాట్ రోడ్డు,అటవీ మార్గాన వెళ్లే బాధలు తప్పించేందుకు 8వేల కోట్లతో మన్ననూర్ – శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్ నిర్మిస్తున్నాం. ఇది సినిమా, షార్ట్ ఫిలిమ్స్ కు మంచి లొకేషన్ అవుతుంది' అని అన్నారు. కార్యక్రమంలో ఫిల్మ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు, :ఎఫ్‌డిసి చైర్మన్ సీహెచ్.ప్రియాంక,దర్శకులు హరీష్ శంకర్,తనికెళ్ళ భరణి,దశరథ్,రాహుల్ సిప్లిగంజ్,అశోక్ కుమార్,శ్రీలక్ష్మి,పి.జీ. విందా,మంగ్లీ,సంగీత దర్శకుడు చరణ్ అర్జున్ తోపాటు పెద్ద సంఖ్యలో యువ దర్శకులు, కళాకారులు, సినీ ప్రముఖులు, అధికారులు పాల్గొన్నారు.

## మరో ముగ్గురు సలహాదారులు నియామకం

**మంతెన, కార్టూనిస్ట్ శ్రీధర్,సీతారామాంజనేయప్రసాద్**

**అమరావతి,డిసెంబర్ 29(జై భీమ్ న్యూస్):**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముగ్గురిని సలహాదారులుగా నియమించింది. ప్రముఖ ప్రకృతి వైద్య రంగ నిపుణులు డాక్టర్ మంతెన సత్యనారాయణ రాజును ఏపీ ప్రభుత్వానికి ప్రకృతి వైద్య సలహాదారుగా నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం జీవోను జారీ చేసింది. డాక్టర్ మంతెన సత్యనారాయణ రాజు దశాబ్దాలుగా ప్రకృతి వైద్యం ద్వారా ఎంతో మందికి సేవలు అందించారు. ఉండవల్లి కరకట్టపై ప్రకృతి చికిత్సాలయం పేరుతో ఆసుపత్రి ఏర్పాటు చేశారు. విజయవాడ, నరసాపురంలోనూ ఆరోగ్యాలయం కేంద్రాలున్నాయి. పోచంపల్లి శ్రీధర్‌రావును ప్రభుత్వం సలహాదారుగా నియమించింది. కార్టూనిస్ట్ శ్రీధర్‌గా సుపరిచితులైన ఆయన మాస్ కమ్యూనికేషన్స్‌లో సేవలు అందిస్తారు. దేవదాయశాఖ సలహాదారుగా చుండూరి సీతారామాంజనేయ ప్రసాద్ నియమితులయ్యారు. మంతెన, శ్రీధర్, సీతారామాంజనేయ ప్రసాద్ తమ పదవుల్లో రెండేళ్ల పాటు కొనసాగనున్నారు. మాస్ కమ్యూనికేషన్ ప్రభుత్వ సలహాదారు నియామకంపై జీవో తొలుత తప్పుగా జారీ అయింది. గంటల వ్యవధిలో తప్పును సరి చేసిన జీఏడీ మరో జీవోను జారీ చేసింది. సరిచేసిన జీవోలో దేవదాయ శాఖ సలహాదారులుగా చుండూరి సీతారామాంజనేయ ప్రసాద్ నియమితులయ్యారు. తొలుత జారీ చేసిన జీవోలో ఆయన్ను మాస్ కమ్యూనికేషన్స్‌కు సలహాదారుగా పేర్కొనడం గమనార్హం.

## పోర్టు అథారిటీ డిప్యూటీ ఛైర్ పర్సన్‌గా రోష్ని అపరాంజి

**విశాఖపట్టణం,డిసెంబర్ 29(జై భీమ్ న్యూస్):**

విశాఖపట్నం పోర్టు అథారిటీ డిప్యూటీ ఛైర్ పర్సన్‌గా మహిళా ఐఏఎస్ అధికారి రోష్ని అపరాంజి కోరాటి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. విశాఖ పోర్టులో ఈ పదవిని చేపట్టిన తొలి మహిళా ఐఏఎస్ అధికారి కావడం విశేషం. విశాఖ పోర్టు అథారిటీకి డిప్యూటీ ఛైర్‌పర్సన్‌గా నియమితులవడానికి ముందు డిప్యుటేషన్‌పై విశాఖ స్పెషల్ ఎకనామిక్ జోన్ లో జాయింట్ డెవలప్‌మెంట్ కమిషనర్‌గా విధులు నిర్వర్తించారు. 2018లో ప్రజా పరిపాలనలో విశిష్ట సేవలకుగాను ప్రధాని అవార్డు సహా అనేక పురస్కారాలు అందుకున్నారు.అస్సాం-మేఘాలయ కేడర్‌కు చెందిన ఆమె తన విద్యాభ్యాసమంతా విశాఖలోనే పూర్తి చేశారు. ఆమె తండ్రి విశాఖపట్నం పోర్టు హై స్కూల్‌లో ప్రధానోపాధ్యాయుడిగా సేవలందించారు. తండ్రి సేవలు అందించిన సంస్థకు కుమార్తె డిప్యూటీ ఛైర్ పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించడం గమనార్హం. ఏప్రిల్ 3, 1984లో జన్మించిన రోష్ని.. ఆంధ్రా విశ్వవిద్యాలయం నుంచి జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్స్‌లో మాస్టర్స్‌లో గోల్డ్ మెడల్ సాధించారు. జిల్లా, రాష్ట్ర, కేంద్ర స్థాయిల్లో ఆమెకు విస్తృత పరిపాలనా అనుభవం ఉంది. అస్సాంలోని జోర్హాట్ జిల్లాకు అదనపు ఉప కమిషనర్‌గా, అదే జిల్లాకు కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్‌గా సేవలందించారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE Jai Bheem



# మార్చి 6న అల్లు శిరీష్ వివాహం

నటుడు అల్లు శిరీష్ త్వరలో వివాహ బంధంలోకి అడుగుపెట్టనున్న విషయం తెలిసిందే. తన ప్రియురాలు నయనికతో అక్టోబర్‌లో నిశ్చితార్థం ఘనంగా జరిగింది. తాజాగా శిరీష్ తన పెళ్లి తేదీని వెల్లడించారు. వచ్చే ఏడాది మార్చి 6న వివాహం జరగనున్నట్లు తెలిపారు. ఇన్‌స్టాలో ట్రెండ్ అవుతోన్న ఓ పాటతో అల్లు అయాన్, అర్హలతో రీల్ చేస్తూ అధికారికంగా చెప్పారు. 'బాబాయ్ సంగీత్ ఎప్పుడు ఉంటుంది' అని వాళ్లు అడగ్గా.. 'మనం దక్షిణాది వాళ్లం.. అలాంటివి చేసుకోం' అని శిరీష్ అన్నారు. అయితే, పెళ్లి ఎక్కడ జరుగుతుంది అనే విషయాన్ని మాత్రం వెల్లడించలేదు. ఇక అల్లు అర్జున్ - స్నేహారెడ్డి వివాహం కూడా 2011లో మార్చి 6నే జరగడం విశేషం. శిరీష్-నయనికల ప్రేమ ప్రయాణం వరుణ్- లావణ్యల పెళ్లి సమయంలో ప్రారంభమైంది. వీరి పెళ్లికి నటుడు నితిన్ సతీమణి షాలినితో కలిసి హాజరయ్యారు. షాలినితో ఆమె స్నేహితురాలు నయనిక కూడా వచ్చారు. తొలిసారి ఆమెను అప్పుడే చూసినట్లు శిరీష్ తెలిపారు. ఆ పరిచయం స్నేహంగా మారి ఇద్దరి మధ్య ప్రేమ చిగురించినట్లు ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పంచుకున్నారు. 'మా పరిచయం ఎలా మొదలైందంటూ ఏదోఒక రోజు మా పిల్లలు అడిగితే ఇదే చెబుతా. నన్ను తమ సర్కిల్‌లో చేర్చుకున్న నయనిక స్నేహితులందరికీ థాంక్స్' అని చెప్పారు.

# శ్రీవారిని దర్శించుకున్న ఛాంపియన్స్



తిరుమల శ్రీవారిని 'ఛాంపియన్' చిత్ర బృందం దర్శించుకుంది. సోమవారం వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో సినిమా హీరో రోషన్, హీరోయిన్ అనస్వర రాజన్.. స్వామివారి సేవలో చిత్ర యూనిట్ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. తితిదే అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శన అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థప్రసాదాలను వారికి అందజేశారు.

# ప్రభాస్ మ్యాష్ అప్ వీడియో విడుదల

ప్రభాస్‌కు అంతర్జాతీయ స్థాయిలో అభిమానులు ఉన్న విషయం తెలిసిందే. ఆయన సినిమా వస్తుందంటే ఇండస్ట్రీలో సందడి నెలకొంటుంది. మరికొన్ని రోజుల్లో ఆయన 'ది రాజాసాబ్'తో పలకరించేందుకు సిద్ధమవుతున్నారు. దీని ప్రచారంలో భాగంగా చిత్రబృందం ఓ మ్యాష్అప్ వీడియో విడుదల చేసింది. ప్రభాస్ కెరీర్ ప్రారంభించినప్పటి నుంచి ఆయన సినిమాలు విడుదలైనప్పుడు అభిమానుల చేసే సందడి, ఇండస్ట్రీలో ఉన్న సినీ ప్రముఖులు ఆయన గురించి పంచుకున్న మాటలు ఆ వీడియోలో చూపించారు. గతంలో ప్రభాస్ అభిమానులను ఉద్దేశించి చెప్పిన కొన్ని మాటలు ఎమోషనల్‌గా ఉన్నాయి. తనకు ఒక్క అభిమాని ఉన్నా చాలు అనుకొని ఇండస్ట్రీకి వచ్చినట్లు ఆయన చెప్పారు.




# రాజాసాబ్ నుంచి మరో ట్రైలర్ విడుదల

## సంక్రాంతి సినిమాలు హిట్ కావాలన్న ప్రభాస్

ది రాజాసాబ్' విడుదలకు సమయం దగ్గరపడుతోంది. ఈ క్రమంలో చిత్ర బృందం ప్రచారాన్ని వేగవంతం చేస్తోంది. ఇప్పటికే పాటలు, ఓ ట్రైలర్‌ను రిలీజ్ చేసిన టీమ్ తాజాగా మరో ట్రైలర్‌ను విడుదల చేసింది. ప్రభాస్ హీరోగా మారుతి రూపొందించిన ఈ మూవీజనవరి 9న బాక్సాఫీసు ముందుకు రానున్న సంగతి తెలిసిందే. రొమాంటిక్ కామెడీ హారర్ నేపథ్యంతో తెరకెక్కిన ఈ సినిమాలో నిధి అగర్వాల్, మాళవికా మోహనన్, రిద్ధి కుమార్ హీరోయిన్లు.'పదిహేనేళ్ల తర్వాత మళ్లీ పూర్తిస్థాయి వినోదంతో 'ది రాజాసాబ్' చేశాం. ఈ సినిమా విషయంలో చాలా ఆత్రుతగా ఉన్నా. అది కూడా సంక్రాంతికి వస్తోంది. సంక్రాంతి సినిమాలన్నీ బ్లాక్‌బస్టర్ అవ్వాలి. మాది కూడా అయిపోతే మరింత సంతోషం అన్నారు ప్రభాస్. ఆయన కథానాయకుడిగా నటించిన 'ది రాజాసాబ్' విడుదలకు ముందస్తు వేడుక హైదరాబాద్‌లో జరిగింది. మారుతి దర్శకత్వంలో రూపొందిన చిత్రమిది. నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధికుమార్ కథానాయికలు. సంజయ్‌దత్, జరీనా వహాబ్ ముఖ్యపాత్రలు పోషించారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టి.జి.విశ్వప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం జనవరి 9న ప్రేక్షకుల ముందుకొస్తోంది.ఈ సందర్భంగా ప్రభాస్ మాట్లాడుతూ 'ఈ సినిమాలో సంజయ్‌దత్ కనిపించిన విధానం అద్భుతం. ఇది నానమ్మ మనవడి కథ. నానమ్మని చూస్తూ నా సన్నివేశాల్ని మరిచిపోయేవాణ్ని. అంతగా ఆ పాత్రలో ఒదిగిపోయారు జరీనా. ఇందులో నాతోపాటు మా నానమ్మకూడా ఓ హీరో. ముగ్గురు అందమైన హీరోయిన్లు ఇందులో ఉన్నారు. ఈ సినిమాకి అనుకున్న బడ్జెట్ ఒకటి, అయ్యింది మరొకటి. నిర్మాత టి.జి.విశ్వప్రసాద్ దేనికీ వెనకాడకుండా సినిమాని పూర్తి చేశారు. ఆయన నిజమైన హీరో ఈ సినిమాకు. ఇలాంటి సినిమాకి ఆ స్థాయిలో రీరికార్డింగ్ చేసే సంగీత దర్శకుడు తమన్ ఒక్కరే అనిపించింది. మారుతి మూడేళ్ల కష్టం, బాధ్యత ఈ సినిమా. సంక్రాంతికి చాలా సినిమాలొస్తున్నాయి. ఎప్పటికైనా సీనియర్లు సీనియర్లే. వాళ్ల నుంచే మేం నేర్చుకున్నాం' అన్నారు. దర్శకుడు మారుతి మాట్లాడుతూ 'కథానాయకుడు ప్రభాస్, నిర్మాత టి.జి.విశ్వప్రసాద్ కారణంగానే ఈ సినిమాతో ఇంత దూరం ప్రయాణించాం. నిర్మాత జీవితాన్ని పెట్టారు ఈ సినిమాకి. థియేటర్‌కి వచ్చినవాళ్లకు మేం ఎంత కష్టపడ్డామో కనిపిస్తుంది. రాజమౌళికి ప్రతి దర్శకుడు చాలా రుణపడి ఉంటారు. పాన్ ఇండియా స్థాయిలో ఎంతోమందికి గుర్తింపు దక్కిందంటే కారణం ఆయనే. నిజంగా ఇది తెలుగు చిత్ర పరిశ్రమకు స్వర్ణయుగం. నా స్థాయిలో నేను సినిమాలు చేస్తుంటే, నువ్వు ఇంకా పైకి ఎదగాలి అంటూ ఈ అవకాశం ఇచ్చారు ప్రభాస్. ఆయన నటించి వెళ్లడం కాకుండా ఈ సినిమాకోసం జీవితాన్ని పెట్టారు. అన్ని భాషల్లోనూ ఈ సినిమా ప్రేక్షకుల్ని అలరిస్తుంది. ఈ కథలో అంత శక్తి ఉంది. ఈ సినిమాలో ప్రభాస్ నటనను ఒక ప్రేక్షకుడిగా చూస్తూ నాకే కన్నీళ్లొచ్చాయి' అంటూ భావోద్వేగానికి గురయ్యారు. ప్రభాస్ వేదికనెక్కి ఓదార్చిన అనంతరం మళ్లీ మారుతి మాట్లాడుతూ ఈ సినిమా ప్రేక్షకుల్ని ఒక్క శాతం కూడా నిరుత్సాహపరచదని చెప్పారు. ఈ కార్యక్రమంలో నటి జరీనా వహాబ్, టి.జి.విశ్వప్రసాద్, అనిల్ తడానీ, తమన్, నవీన్ ఎర్నేని, కృతిప్రసాద్, మహేశ్ ఆచంట తదితరులు పాల్గొన్నారు. ఈ వేడుకకి ప్రధాన ఆకర్షణ ప్రభాస్ హెయిర్ స్టైలే. ఆయన పిలకతో ఈ వేడుకకు హాజరయ్యారు. 'స్పిరిట్' కోసం ఆ గెటప్‌లో సిద్ధమయ్యారు. వేడుకలో అభిమానుల్ని ఉద్దేశించి ఉత్సాహంగా మాట్లాడారు. ఏదో ఒక రోజు అందరూ షాక్ అయ్యేలా వేదికపై వినోదం పంచుతానని ఆయన చెప్పడంతో అభిమానులంతా కేరింతలు కొట్టారు. వేడుకలో ప్రభాస్ పెళ్లి చేసుకునే అమ్మాయికి ఎలాంటి క్వాలిటీస్ ఉండాలి అంటూ ఓ అభిమాని ప్లకార్డు ప్రదర్శించారు. 'అది తెలియకే ఇంకా పెళ్లిచేసుకోలేదు' అంటూ ఫన్నీగా సమాధానమిచ్చారు ప్రభాస్.